# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 37 సంచిక 1
పేజీలు 40
సెప్టెంబర్ 2017

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


భద్రవాక్యం ....................................................2
శ్రీబాబూజీ ఉవాచ.............................................. 4
అమ్మమాట................................................. 8
తిండిపోతు ..................................................10
మృగతృష్ణ ............ ........................... .............12
స్వర్గాధిపతి ఇంద్రుడు ...... ..............................14
త్రిపురా రహస్యం ........................................... 16
ఈశ్వరునిలో మునగండి .................. .......18
జీమూత వాహనుడు ............. ...................... 19
ముండకోపనిషత్తు ......................................... 21
ఆత్మసాక్షాత్కారము .......................................23
యోగవాశిష్ఠము ........................................... 25
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..............................27
పరిప్రశ్న ...........................................................28
నారదముని కలహప్రియుడా?..................30
శ్రీకృష్ణకర్ణామృతము.........................................33
రాధ భక్తి ................. ......................................34
శ్రీ పరమానందయ్య శిష్యులు................. 36
సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....37
విష్ణు కథలు- మీరాబాయి.............................39

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

స్వప్నే సజీవః సుఖదుఃఖ భోక్తా। స్వమాయయా కల్పిత జీవలోకే।
సుషుప్తికాలే సకలే విలీనే తమోఽభిభూత ః సుఖరూపమేతి ॥
(కైవల్యోపనిషత్ శ్లో॥ 13)

జీవుడు స్వప్నమందు తన మాయచేత కల్పించుకొన్న జీవ లోకంలో సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. జాగ్రదావస్థలో దేహమనో బుద్ధుల ద్వారా జీవిస్తున్న జీవుడు స్వప్నజగత్తులో స్వప్నద్రష్టగా వ్యవహరిస్తూ దేహసంబంధిత కార్యాల నుండి విరమించుకుని మనో బుద్ధి రూపమైన సూక్ష్మ శరీరం ద్వారా అనుభవాలను పొందుతున్నాడు. ఆ స్వప్నద్రష్ట తైజసుడుగా వ్యవహరిస్తున్నాడు.

దేహస్మృతి ఉన్నంత కాలం స్వప్న ద్రష్టకాలేడు సుమా! దేహస్మృతి కల్గిన విశ్వుని కంటె తైజసుడు వేరుకాదు. ఇంద్రియాల ద్వారా గ్రహించ గల్గిన ప్రపంచ జ్ఞానం లేనప్పుడు స్వప్నద్రష్ట లేక తైజసుడు తన స్వంత ఆలోచనలతో సూక్ష్మ శరీరంలో వ్యవహరిస్తాడు. కాబట్టి స్వప్న ప్రపంచము మనస్సుతో కల్పించబడినదే. ఆ స్వప్న ప్రపంచంలో తానే కర్త, కర్మ, జ్ఞాత, జ్ఞేయం అయి సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. ఆత్మ జ్ఞానము లోపించటమే అజ్ఞానము అదే మాయ. అది అన్యభావనకి దారి తీస్తుంది. మసక చీకటిలో త్రాడును చూసి పాముగా భ్రమ చెందుతాడు. జాగ్రదావస్థలోని విశ్వుడు స్వప్నంలోని తైజసుడే గాఢ సుషుప్తిలో కారణ శరీరం ద్వారా వ్యక్తమై ప్రాజ్ఞుడుగా వ్యవహరిస్తాడు.

కారణశరీరము వాసనా సమూహము. వాసన చేత బుద్ధిలో ఆలోచనలు మనస్సులో సంకల్పాలు చిత్తములో రూపకల్పన జరుగుతుంది. అదే దేహము ద్వారా కార్యరూపము దాల్చటం జరుగుతుంది. ఇది అందరికి తెలిసిన విషయమే. అందువలన పరమాత్మ ఒక ఉపాధికి పరిమితమవ్వటానికి లేక అభివ్యక్తం అవ్వటానికి కారణం వాసనలు లేక కారణ శరీరం.

కారణ శరీరంలో వాసనలు బీజరూపంలో ఉంటాయి. విత్తనంలో చెట్టు అవ్యక్తంగా బీజరూపంలో ఉంటుంది కదా! పరిస్థితులు అనుకూలించినప్పుడు ఆ చెట్టు వ్యక్తమవుతుంది. అలాగే బీజదశలో వున్న

వాసనలు ఆలోచనలకి, భావనలకి కార్యాలకి తావివ్వవు. అది తమస్సు చేత అభిభూతమైన స్థితి. పూర్తి అజ్ఞాన రూపము. చీకటి గదిలో చీకటి ఆవరించటం వలన ఆ గదిలోని చీకటితెర వస్తువులన్నింటిని కప్పివేస్తుంది. ఏవీ గోచరించవు. సుషుప్తిలోని తమస్సు లేక అజ్ఞానము జీవునికి దుఃఖం కలిగించదు. పరిపూర్ణ ఆనంద స్థితి కాదు. అది మధ్యస్థ స్థితి. అది అభావరూపమైన స్థితి. జాగ్రత్, స్వప్న అవస్థలలో మాదిరి దుఃఖదాయకమైన ప్రాపంచిక విషయాదుల బాధ ఉండదు. కాబట్టి జీవుడు ఈ స్థితిలో ఒక రకంగా ఆనంద స్థితిలో ఉన్నట్లే కదా! అయితే అది శాశ్వతానంద స్థితి కాదు. గాఢసుషుప్తిలో ఇంద్రియాలు, మనో బుద్ధులు అణిగి ఉన్న స్థితి అంతేగాని, వాసనా రహిత స్థితి మాత్రం కాదు.

## విన్నపము

సమర్థ సద్గురు తెలుగు మ్యాగజైన్ పాఠకులకు సవినయ విన్నపము

ఇటీవల పేపర్ ఖర్చులు, ప్రింటింగ్ ఖర్చులు విపరీతంగా పెరగటం వల్ల సమర్థ సద్గురు యాజమాన్యం ఈ క్రింది నిర్ణయాలు తీసుకున్నది:

1. లైఫ్ మెంబర్స్‌గా 20 సంవత్సరాల పైగా ఉన్న వారు తిరిగి రూ.1116/- కడితే వారికి 20 సంవత్సరాలు ఈ మాస పత్రిక పంపుతాము. కాబట్టి వారిని వెంటనే ఈ మొత్తం కట్టమని ప్రార్థిస్తున్నాము.
2. యాన్యువల్ మెంబర్స్‌ని కూడా రూ.1116/-కట్టి లైఫ్ మెంబర్స్‌గా మారమని కోరుతున్నాము.
3. ఈ ఆధ్యాత్మిక మాస పత్రికాభివృద్ధి కోరే దాతలను రూ.11116/-కట్టి మహారాజపోషకులుగా, రూ.5116/- కట్టి రాజపోషకులుగా చేరమని వేడుకుంటున్నాము.
4. మీ బంధు మిత్రులను, తోటి సహాధ్యాయులను సభ్యులుగా చేర్చమని కోరుతున్నాము.

ఈ చందా రుసుము YSCKPM CHARITABLE TRUST - SAMARDHA SADGURU MAGAZINE A/C పేరుమీద MO/DD/Cheque గాని తీసి పంపించ ప్రార్థన

సమర్థ సద్గురు యాజమాన్యం

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు ఉద్బోధిస్తూ "మృత్యువు అంటే అందరికీ భయమే. భగవద్గీతలో చెప్పబడినట్లు పుట్టినవాడికి చావు తప్పదు. మృతి చెందిన వాడికి పుట్టుక తప్పదు కదా? మరి ఈ జనన మరణ విషవలయం నుంచి తప్పించుకునే మార్గం లేదా? ఉంది. సమర్థులైన సద్గురుమూర్తిని ఆశ్రయించి ఆయన ప్రసాదించిన లక్ష్యార్థాన్ని సాధన చేసినవారు తప్పక రక్షింప బడతారు. భగవానుడు ప్రసాదించిన దేహము ఒక యంత్రము. ఇది మన స్వగృహముకాదు. ఇది ఒక అద్దెకొంప. ఇక్కడ శాంతికి తావులేదు. మన స్వగృహానికి వెళితేనే శాంతి. మనం పగలంతా బయటకు వెళ్ళి ఉదరపోషణార్థం ఎంతోకష్టపడి పనిచేసినా సాయంత్రానికి మన గృహానికి మనంచేరాలి కదా? ఎంత పెద్ద



వుద్యోగస్థులైనా, ఎంతో హోదా పలుకుబడి ఉన్నా సాయంత్రానికి ఇంటికి చేరకతప్పదు. పక్షులు చూడండి. ఉదయమే ఆహార సముపార్జన కోసం గుంపులు గుంపులుగా బయలుదేరి వెళతాయి. కానీ సాయంత్రం అయ్యేసరికి ఆ పక్షులన్నీ ఏదో చెట్టుని ఆశ్రయించి తమ నివాసానికి చేరుకుంటాయి. మానవుడు తన జీవిత లక్ష్యాన్ని సాధించడానికి ముఖ్యమైన అవరోధము జన్మాంతరవాసన. ఇది అనేక జన్మలద్వారా సంక్రమించిన నిధి" అని చెప్పారు.

ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. ఇది మీకందరికి అనుభవములో ఉన్నదే. ఇప్పుడే మీరు తిన్న ఇడ్లీ సాంబారు వాసనగానీ, పప్పు ఆవకాయ అన్నం తిన్న వాసనగానీ, మీరు మీ చేయిని ఎంత కడుక్కున్నా పోదుకదా! మరి అనేక జన్మలనుండి ఆర్జించిన వాసన అంత సులభంగా రహితం అవుతుందా? అది రహితం అవ్వాలంటే నీ మనస్సుని నువ్వు ఆశ్రయించిన సద్గురుమూర్తి దివ్యచరణార విందములపై నిలపాలి. సాధనకి అవరోధంగా నిలిచేవాసన లేక

సంకల్పము లేక కోరికను సద్గురుమూర్తి అనుగ్రహం లేనిదే జయించడం దుర్లభము. మనస్సులో ఏదైనా సంకల్పము కలిగిన వెంటనే దానిని పొందడానికి చేసే ప్రయత్నమునే 'కర్మ' అంటారు. కర్మ ఆచరించడం ద్వారా పొందిన అనుభవము లేక ఫలితమే మనము చేసిన కర్మను అనుసరించి జన్మని సంప్రాప్తింప జేస్తుంది. కాబట్టి నీకు సంప్రాప్తమైన దేహము కర్మద్వారా సంక్రమించినదన్నమాట. మానవ జీవితం చాలా విచిత్రమైనది. మాతృగర్భంలో ఏమి చేయలేని స్థితి. బాల్యం అంతా ఆటపాటలతో సరిపోతుంది.

యౌవనంలో కాలాన్ని గుర్తించే స్థితిలో ఉండడు కదా. పోనీ వృద్ధాప్యంలో అయినా జన్మాంతరవాసనని రహితం చేసుకుంటాడా అంటే రక్తమాంసములతో కూడిన ఈ దేహాన్ని ఆశ్రయించి, అహంకార మమకారములతో కాలాన్ని వృథా చేస్తాడు. దీనినుండి బయటపడడు, పడలేడు. కారణం జన్మజన్మలనుంచి మనస్సు విషయాదులలో ఊరి వుండటం వలన మాయలో పడిపోతాడు. రోగము వచ్చినప్పుడు వైద్యుడు ఇచ్చిన మందు పథ్యము చేస్తేనే సరిగా పనిచేస్తుంది. కాబట్టి మానవ జన్మ ఎత్తినందుకు ఈ జన్మలోనే తరించాలి అనేతపన లేక ఆవేదన మనపాత్రను బట్టి, సంస్కారాన్నిబట్టి, భక్తివిశ్వాసాలనుబట్టి భగవంతుని అనుగ్రహము ద్వారా కల్గుతుంది. భగవంతునిపై మనస్సుని లగ్నంచేస్తే ఈ జన్మలో కాకపోతే మరుజన్మలోనైనా తరించవచ్చు.

మానవుడు భగవంతుని విశ్వసించి, ఆచార్యుని ఆశ్రయించి, గురుతత్వాన్ని అర్థంచేసుకున్నప్పడే నిరతిశయమైన పరమపదము లభిస్తుంది. మానవుని సంస్కారమన్నా, పాత్రత అన్నా అవి జన్మాంతర వాసనలననుసరించి ఉంటాయి. మానవుడు శాస్త్రవాసన, లోకవాసన, దేహవాసన అనబడే వాసనాత్రయానికి దాసుడై ప్రవర్తిస్తాడు. శాస్త్రవాసనకు లోబడిన వ్యక్తులు మహాత్ములు ఎంతబోధించినా తాము నమ్మిన సిద్ధాంతాన్నే విశ్వసిస్తారు. వీరు గ్రంథపఠనకు, శాస్త్రాలకు ప్రాముఖ్యతనిస్తారు. తర్కము వారి సహజ లక్షణము. మహాత్ములు ఎంతబోధించినా వారిబోధనా విషయాన్ని అంత తేలికగా తర్కములేకుండా అంగీకరించరు.

ఇది జన్మజన్మల నుంచి సంక్రమించిన సంస్కృతి లేక సంస్కారం. గ్రంథపఠనము తప్పకాదు. శాస్త్రజ్ఞానము కూడా ఆమోదించ

దగినదే. కానీ శాస్త్రజ్ఞానాన్ని సద్గురుమూర్తి బోధతో అన్వయించుకుని దానిని అనుభంలోనికి తెచ్చుకున్నప్పడే అది ప్రకాశిస్తుంది. శాస్త్రవాసనకన్న లోకవాసన ఇంకా ప్రమాదకరమైనది. లోకవాసన వున్నవ్యక్తి ఉన్నతపదవి, పలుకుబడి, హోదా, పరువు, ప్రతిష్ఠ, కీర్తి వ్యామోహానికి లోబడి పోతున్నాడు. అన్నింటికన్నా కీర్తి వ్యామోహం చెడ్డది. దానిని వదిలించు కోవడం చాలా కష్టం. అది సిరిగల మొలగజ్జిలాంటిది. అదిగుప్తమైన ప్రదేశాలలో వస్తుంది. గోకినకొద్దీ చాలా తియ్యగా ఉంటుంది. తరువాత మంటగా ఉంటుంది. అలాగే లోకవాసన తాత్కాలికమైన సంతృప్తిని కలుగజేసినా అది ఆ వ్యక్తి పతనానికి దారితీస్తుంది. దేహవాసన అన్నిటికన్నా ప్రమాదమైనది. ఈ దేహమునేను, నాది అనే భావనే దేహవాసన.

ఈ భావన తొలగనంతవరకు జనన మరణ విషవలయంలో ప్రయాణము చేయక తప్పదు. దేహము నేను అనే భావన వలననే దేహాన్ని ప్రేమించి అభిమానిస్తాడు. దీనినే దేహాభిమానము అంటారు. దేహానికి ఏదైనా వ్యాధి సంక్రమించినపుడు దానిని గురించి ఎంతో శ్రద్ధ తీసుకుంటాడు. డాక్టరుగారు చక్కెర పదార్థాలు తినకూడదు. వుప్పలేని పదార్థాలు తినాలి, అని హెచ్చరించినపుడు దేహ ఆరోగ్యాన్ని కాపాడుకునే నిమిత్తం ఆ నియమాలని ఎంతో శ్రద్ధగా ఆచరిస్తారు. కానీ మహాత్ములు సాధకులకు ధ్యానం సక్రమంగా కొనసాగించడానికి మితాహారము, మితభాషణము చేస్తే నిద్ర, బద్ధకము లేకుండా వుంటుందని హెచ్చరిస్తే దీనిని ఆచరించేవారు ఎంతమంది? అదే దేహాభిమానమంటే. ఇది మార్బుల్ పైన నాచులాగా మనస్సుని ఆవరించి ఉంటుంది.

అది సాధకుడిని జారిపడేలాచేస్తుంది. పతనానికి దారితీస్తుంది. సమయంకోసం పొంచిచూసి పంజాదెబ్బకొడుతుంది. దేహవాసన మనస్సులో బలముగా నాటుకుపోయి నాజాతి, నాకులము, నామతము, నా గోత్రము, నావాళ్ళు అనే భావన నశించనంతవరకు జన్మ తప్పదు. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. భగవానుడు అన్నా, అల్లా అన్నా, గాడ్ అన్నా ఒక్కడే కదా! భాష మాత్రం వేరు. మానవుడు ఏ జాతికి చెందినవాడైనా తన ఆరాధ్యదైవము అయిన భగవానుడు ఒక్కడే. ఒక వ్యక్తి ఉన్నాడు. అతని కుమారుడు 'నాన్నగారూ!' అని సంబోధిస్తాడు.

అదే వ్యక్తిని మనమడు 'తాతగారూ!' అంటాడు. ఆవ్యక్తి తమ్ముని కుమారుడు 'పెదనాన్న గారూ!' అంటాడు. చెల్లెలి కుమారుడు 'మామయ్యా!' అంటాడు. చెల్లెలి భర్త 'బావగారూ!' అంటారు. ఇలా ఏ విధంగా సంబోధించినా ఆ వ్యక్తి ఒక్కడే కదా!

అలాగే నువ్వు ఆశ్రయించిన భగవానుడు నువ్వు ఏ నామంతో పిలిచినా పలుకుతాడు. ఆయన రూప నామ క్రియారహితుడైనా అన్ని రూపములు, అన్ని నామములు ఆయనవే. నిర్వహింపబడే ఏ క్రియకైనా ఆయనే ఆధారం. కాబట్టి దేహవాసన రహితం అవ్వాలంటే సద్గురుమూర్తిని ఆశ్రయించి ఆయన ప్రసాదించిన మంత్రరాజాన్ని స్మరిస్తూ ఆయన నిర్దేశించిన ఏ సేవ చేసినా అంతకుమించిన సాధన మరొకటిలేదు. అది జన్మజన్మలనుంచి సంక్రమించిన వాసనలను రహితంచేసి, జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తుంది. ఇది మాత్రం సత్యం. శాస్త్రజ్ఞానం ఒక గదిలో దీపములాంటిది. దాని కాంతి ఆ గదికే పరిమితం. కాని ఒక భక్తుని జ్ఞానసంపద పౌర్ణమినాటి చంద్రుని కాంతివంటిది. అది అంతటా వ్యాప్తమై ఉంటుంది. పరమహంస స్వరూపుల కాంతి, దివ్యతేజస్సు అజ్ఞానమనే చీకటిని తనలో లయింప చేసుకుంటుంది" అన్నారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, సుంకర లక్ష్మీసుజాతగారు (అమెరికా సుంకర ప్రసాదుగారి అక్క) 27-7-2017 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 76సంవత్సరాలు.

సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము!

(గత సంచిక తరువాయి) # అమ్మమాట - జపమాల ప్రసాద

## భజగోవిందమ్ మూఢమతే! -6

**సత్సంగత్వే నిస్సంగత్వమ్। నిస్సంగత్వే నిర్మోహత్వమ్।**
**నిర్మోహత్వే నిశ్చల తత్త్వమ్। నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః॥**



విచ్చలవిడిగా పరుగులు పెట్టే మనస్సుని మార్పులు లేనటువంటి సత్యవస్తువునందు నిలపడమే సత్సంగము. ఎప్పుడయితే మనస్సు సత్యవస్తువుతో కలిసి వుంటుందో, ప్రాపంచిక విషయాదుల యందు నిస్సంగం దానంతట అదే వస్తుంది.

నిస్సంగము అంటే డిటాచ్‌మెంట్. ఈ నిస్సంగము వలన మోహము తొలగి మనస్సు నిశ్చలమవుతుంది. ఎప్పుడైతే మనస్సు నిశ్చల స్థితికి చేరుకుంటుందో అదే జీవన్ముక్తి. అంటే జీవించి వుండగానే ముక్తి లభిస్తుంది.

నిరంతరం సత్యవస్తువుతో రమించడమే సత్సంగము. సత్య వస్తువుతో ఎటాచ్ అయితే, విషయాదుల నుండి డిటాచ్ ఆటోమ్యాటిక్‌గా అయిపోతుంది. మనకు ఇన్ని మంచి విషయాలు సజ్జన సాంగత్యం వల్లనే తెలిశాయి. సత్సంగం చేసుకోవడానికి యింతమంది జనం ఉండాలి అని ఏమీ లేదు. పది మంది అవ్వచ్చు, లేదా ఇద్దరే అవ్వచ్చు. సద్వస్తువు గురించి విచారణ చేసుకోవాలి. ఒక్కరే ఉండి కూడా చేసుకోవచ్చు. ఒక మంచి గ్రంథం చదవటం, దాన్ని గురించి విచారణ చేసుకోవడం కూడా సత్సంగమే. ఒక్క ముక్కలో చెప్పాలంటే, మనలోనే వుండి, మనల్ని ప్రకాశింపజేస్తూ, సమస్త సృష్టిని ప్రకాశింపజేస్తున్న ఏకైక సత్యవస్తువుతో నిరంతరం రమించడమే సత్సంగం. ఇది మనలను నిశ్చల స్థితికి తీసుకుని వెళ్తుంది. ఇదే జీవన్ముక్తి.

అయితే ఇటువంటి స్థితి అందరికీ సాధ్యమా అంటే, గురుభక్తులకి సాధ్యం కానిదేదీ లేదు - అని శ్రీశంకర భగవత్పాదులవారు యీ క్రింది శ్లోకంలో వివరిస్తున్నారు ..................

**గురు చరణాంబుజ నిర్భర భక్తః । సంసారా దచిరాద్భవ ముక్తః**

**సేంద్రియ మానస నియమా దేవమ్ । ద్రక్ష్యసి నిజ హృదయస్థమ్ దేవమ్ ॥**

శ్రీగురు చరణారవిందముల యందు చలించనటు వంటి, దృఢమైనటు వంటి భక్తి కలిగిన భక్తుడు సంసారమనే సాగరం నుండి వెంటనే ముక్తిని పొందగలడు. ఏ గురుభక్తుడయితే తన ఇంద్రియాలని తన అదుపులో వుంచుకుని, సాధనచేసి, తన హృదయంలోనే ప్రకాశిస్తున్న పరమాత్మని దర్శిస్తాడో అతడు యీ సంసార వలయం నుండి క్షణకాలంలో ముక్తిని పొందగలడని శ్రీశంకర భగవత్పాదులవారు మనకి నిర్దేశించారు.

భగవద్గీతలో కూడా ఇదే విషయం గురించి చెబుతూ శ్రీకృష్ణ భగవానుడిలా అన్నాడు ....

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం । తత్పర ః సంయతేంద్రియః ।**

**జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిమ్ అచిరేణాధి గచ్ఛతి ॥**

అని శెలవిచ్చారు.

శ్రద్ధ, ఇంద్రియ సంయమనము కలిగి వున్న సాధకుడు జ్ఞానం పొందడమనేది తథ్యం. కనుక అటువంటి సాధనా సంపత్తిని, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి, గురుపాదుకలు మనలను సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన కొండ వెంకట శివరామ రాజుగారు 24-8-2017 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 86సంవత్సరాలు.

సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము!

# తిండిపోతు

(పరమార్థ కథల నుండి)

ఒక గ్రామంలో ఒక తిండిపోతు ఉండేవాడు. అతనికి కడుపే కైలాసం. ఎక్కడ విందులు జరుగుతాయా? పెళ్ళి భోజనాలు ఎక్కడ దొరుకుతాయా? అని అహర్నిశలూ ఆలోచిస్తూ అతడు ఏ భోజ్య పదార్థం కనిపించినా వేళాపాళా లేకుండా దానిని ఆరగించేవాడు. ఈ ప్రకారంగా అధిక భోజనం చేస్తూ శరీరం యొక్క బలాన్ని పెంచుకుని, తిండిని గురించి రాత్రింబవళ్ళు చింతిస్తూ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునేవాడు.

ఇలా ఉండగా ఒకరోజు అతడు ఊరి బయట ఒక చెట్టు క్రింద కూర్చుని జపాలు తపాలు బ్రహ్మను గూర్చి చేయటం మొదలుపెట్టాడు. అది చూసి ఊరివారంతా ఆశ్చర్యచకితులై, ఈ తిండిపోతుకు ఇంత భక్తి ఎలా కలిగిందా! అనుకున్నారు.

కొంతకాలం గడిచిన తరువాత అతనికి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై "ఓయీ! నీ తపస్సుకు మెచ్చాను. ఏదైనా వరం కోరుకో!" అన్నాడు. "మహాప్రభో! నాకేమీ వరం అవసరం లేదు. నాకు ఒక ధర్మసందేహం కలిగింది. అది తీర్చుకోవడానికై తపస్సు చేశాను. నా సందేహాన్ని తీర్చండి" అన్నాడు తిండిపోతు.

బ్రహ్మ - నిరభ్యంతరంగా అడుగు.

తిండి - దేవా! ఈ సృష్టి అంతా చేసింది ఎవరు?

బ్రహ్మ - నేనే.

తిండి - అయితే మనుష్యులను సృష్టించిందెవరు?

బ్రహ్మ - నేనే.

తిండి - మనిషి తల ఎవరు సృష్టించారు?

బ్రహ్మ - నేనే గదా!

తిండి - మహాప్రభో! ఆ తలలో రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు ముక్కురంధ్రాలు పెట్టారు. చాలా బాగుంది. కానీ ఒక్క నోరా! రామ రామ! అన్నీ రెండు రెండు పెట్టి, నోరు మాత్రం ఒక్కటి పెట్టటం నాకు సమంజసంగా తోచలేదు. ఒకేచోట ఉండేవస్తువులు సరిసమానంగా వుండటం భావ్యం కదా. సరే అయిందేదో అయింది. రాబోయే సృష్టిలో

మీరు ఈ విషయం జ్ఞప్తిలో వుంచుకుని, తలలో రెండు నోర్లు పెట్టి, ఈ చిన్ని మార్పును త్వరలో చేస్తే బాగుంటుందని చూస్తున్నాను. అలా రెండు నోళ్ళు ఉంటే మా బోటి అధిక భోజనప్రియులకు చాలా అనుకూలంగా వుంటుంది. మహాత్మా! ఈ విషయం నా దృష్టిలో ఎంతో ప్రాధాన్యత కలదిగా తోచింది. కనుక అది మీ దృష్టికి తెచ్చాను. కాబట్టి నేను సూచించిన ఈ విషయాన్ని దీర్ఘంగా ఆలోచించి, ఆ ప్రకారంగా చేయమని ప్రార్థిస్తున్నాను.

బ్రహ్మ - ఓరీ! ఈ సంగతి నాకు తెలియకుండా పోలేదు. బాగా ఆలోచించే ఒక నోరు పెట్టాను. ఒక నోరు ఉంటేనే జనులు ఊపిరి సలపకుండా తింటున్నారు. ఇంక రెండునోళ్ళుంటే వేరే చెప్పాలా? ఒక నోరుంటేనే చెడు వాగుడు వాగుతున్నారు. ఇంక రెండునోళ్ళుంటే వేరే చెప్పాలా? కాబట్టి మితాహారం సేవించాలని, మితభాషణం చేయాలని జనులకు తెలియ జేయటం కోసమే ఒక నోరు ఏర్పాటు చేశాను. ఇప్పటికైనా తెలుసుకుని బాగుపడు. అధిక భోజనం ఎవరికీ మంచిది కాదు. దానివల్ల ఆరోగ్యం చెడటమే కాక, ఇతరుల యొక్క ఆహారాన్ని తస్కరించినవారవుతారు.

తిండిపోతు - బ్రహ్మదేవా! చక్కగా సెలవిచ్చారు. ఇకమీదట మీరు చెప్పిన ప్రకారమే మిత భోజనం అలవాటు చేసుకుంటాను.

బ్రహ్మదేవుడు సంతోషించి అంతర్ధానమయ్యాడు. ఆ తిండిపోతు ఇంటికెళ్ళి మితాహారం అలవాటు చేసుకుని బాగుపడ్డాడు.

నీతి - ఆహారాన్ని అధికంగా భుజింపరాదు. మితాహారాన్ని సేవిస్తూ, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ, దైవ చింతన చేస్తూ జీవితాన్ని ఆనందంగా గడుపుకోవాలి.

# మృగతృష్ణ

- పాలూరి కాళీప్రసాద్

రాము ట్రైన్ దిగి ఇంటివైపుగా నడుస్తున్నాడు. 'ఈ అమ్మ ఎప్పుడూ ఇంతే. చాదస్తం! రోజూ ఫోన్ చేసి, గుడికి వెళ్ళావా? దేవుడికి పూజ చేసుకుంటున్నావా? ... అంటూ విసిగిస్తుంది. ఇంత బిజీ జీవితంలో వాటన్నిటికి టైమ్ ఎక్కడ ఉంటుంది?'

అసలే చీకటి పడుతుంటే వడివడిగా అడుగులు వేస్తున్నాడు రాము. ఒక సందు మలుపు తిరగగానే కనిపించింది ఆ మెరుపుతీగ! "అబ్బ! వెనకాల నుండే ఇంత అందంగా ఉంటే, ఇహ ముందునుండి ఇంకెంత అందంగా ఉండిఉంటుందో! ఈ మసక చీకట్లో సరిగా కనబడటం లేదు. వీధిలైట్ ఉంటే బాగుండేది" అనుకుంటూ ఆమె ముఖాన్ని చూడాలనే ఆతృతతో దాదాపు పరుగులాంటి నడక ప్రారంభించాడు. అది గమనించిన ఆమె ఇంకా వేగంగా నడవసాగింది.

"ఈ వంటరి జీవితం దుర్భరంగా ఉంది. త్వరగా ఈమెతో పరిచయం పెంచుకుని పెళ్ళిచేసుకుంటే ఎంత బాగుంటుందో! మాకు తనలాగే అందమైన పిల్లలు పుడతారు. ఆమె ఒంటిమీద బట్టలు, నగలు అవి చూస్తూంటే, మా మామగారు బాగా డబ్బున్నవాడిలాగే అనిపిస్తోంది. మనం కూడా త్వరగా లైఫ్‌లో సెటిల్ అయిపోవచ్చు. పెద్దయిల్లు కట్టి, పిల్ల పాపలతో హాయిగా కాలం గడపవచ్చు" అని ఊహాలోకంలో తేలిపోతూ ఆమెను అనుసరిస్తూ నడుస్తున్నాడు రాము.

ఇంతలో ఆమెను దాటి ఒక వీధి దీపం వెలుగులో ఆమె ముఖం చూశాడు. అంతే! ఆతృతగా ఆమె ముఖం వంక చూసిన రామూ ఆశా సౌధాలన్నీ పేకమేడల్లా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు! తన మీద తనకే విరక్తి కలిగింది. అక్కడికక్కడే కుప్పకూలిపయాడు! ఎక్కడో దూరంగా బడ్డీకొట్టులో నుండి పాట వినిపిస్తోంది. ............

మరులుగొలిపే సిరులూ మేలూ నిలువబోవే మనసా
స్థిరముగానీ ఇహభోగముల పరము మరువకే మనసా
శేషశాయిని, మోక్షదాయిని - సన్నుతి సేయవే మనసా
ఆపన్న శరణ్యుని హరినీ - సన్నుతి సేయవే మనసా! ॥

అలాగే మనం విషయాదుల వెంట పరుగెత్తినన్నాళ్ళూ అవి ఎంతో అందంగా కనబడి, మనలను ఊరిస్తూ ఉంటాయి. ఒక్కసారి మనం వాటిని దాటి వెనక్కి తిరిగి భగవంతుని వెలుగులో వాటిని చూస్తే వాటి అసలు స్వరూపం బయట పడుతుంది.

# శుభాభినందనలతో..... ........



INDIGENEOUS anadig MAKE
CAKT-02, CAKT-05, CAKT-06 & TAK-011-03
ENGINE ROOM INSTRUMENTATION FOR EKM SUBMARINE
INDIGINOUS INTRUMENTS FITTED ON
• INS SINDHUKESRI
• INS SINDHUGHOSH
• INS SINDHUSHSTRA
• INS SINDHURAJ
• INS SINDHUKIRTI
• INS SINDHUVIR
• INS SINDHUVIJAY
anadig systems

# స్వర్గాధిపతి ఇంద్రుడు

- రమణ ప్రసాద్

దేవతలకు రాజు ఇంద్రుడు. అదితి కశ్యపుల పుత్రుడు. ఆదిత్యులలో ఒకడు. ఆయన భార్య శచీదేవి. వారికి ముగ్గురు పుత్రులు, జయంతుడు, ఋషభుడు, మిధుషుడు. ఆయన రాజధాని అమరావతి. అక్కడ దుఃఖాలు ఉండవు, ఆయన సభలో ఊర్వశి, రంభ, తిలోత్తమ మొదలైన అప్సరసలు, గంధర్వులు నృత్యం చేస్తుంటారు. ఆయన ఆయుధం వజ్రాయుధం. ఆయన వద్ద ఐరావతం అనే నాలుగు కోరలుగల తెల్లని ఏనుగు, సకల కోరికలను తీర్చగల కామధేనువు ఉన్నాయి. అతడు గొప్ప యోధుడు. పిడుగులు , తుఫానులు ఆయన నిర్దేశం వల్లనే సంభవిస్తాయి. ఋగ్వేదంలో ఇంద్రుని వైభవం గురించి ఎన్నో మంత్రాలు ఉన్నాయి. యజ్ఞ యాగాలలో ఇంద్రుని ఆవాహన చేస్తారు. ఆయన భక్తులకు కోరిన వరాలను ప్రసాదిస్తాడు.



అయితే ఇంద్రుడు ఒక వ్యక్తి కాదు. మనకు 14 మన్వంతరాలు ఉన్నాయి. ఏ మన్వంతరంలో ఏ మనువు పాలిస్తే ఆ మనువును ఇంద్రుడు అంటారు. వేదాలలో చెప్పబడిన 14 మన్వంతరాలలో 14 మంది మనువులు పాలిస్తారు. ఇంతవరకు మనకు 6 మన్వంతరాలు గడిచాయి. అవి స్వాయంభువు, స్వారోచిషు, ఉత్తమ, తామస, రైవత, భామేష్. ఆ మన్వంతరాలలో ఇంద్రులు వరుసగా, విష్ణుభుక్, విద్యుతి, విభువు, ప్రభువు, శిఖీ, మనోజవుడు. ప్రస్తుతం వైవస్వత మన్వంతరం జరుగుతోంది. దీనికి ఇంద్రుడు ఓజస్వుడు.

ఎవరైనా కఠోర తపస్సు చేసి ఇంద్ర పదవిని పొందవచ్చు. వెయ్యి అశ్వమేధ యజ్ఞాలు చేసి ఇంద్ర పదవిని పొందవచ్చు. ఇంద్రుని పైకి దండెత్తి అతడిని నిర్జించి ఇంద్రుడు కావచ్చు. అసురులు యుద్ధంలో ఇంద్రుని ఓడించి ఇంద్రులైనారు. ఇంద్రునికి బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల అండ దండలు ఉండటం చేత ఇంద్రుడు తిరిగి రాక్షసులపై యుద్ధం

చేసి గెలిచి ఇంద్ర పదవి దక్కించుకున్నాడు. ఎవరైనా కఠోర తపస్సు చేస్తుంటే ముందు జాగ్రత్తగా అప్సరసలను పంపి వారికి తపో భంగం కావించేవాడు.

ఇంద్రుడు వృత్రుడు అనే రాక్షసునితో చేసిన యుద్ధానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. వృత్రుడు విశ్వంలోని నీటిని హరించాడు. ఇంద్రుడు అతడిని యుద్ధంలో సంహరించాడు. అతడినుండి జలం ప్రవహించింది. ప్రజలంతా ఇంద్రుని కొనియాడారు. అయితే వృత్రుడిని చంపటం వల్ల బ్రహ్మ హత్యా పాతకం చుట్టుకుని, అది ఇంద్రుని వెంబడించింది. ఇంద్రుడు బ్రహ్మను వేడి కఠోర తపస్సు చేసి ఆ పాతకంనుండి విముక్తి పొందాడు.

తనను మించినవారు లేరనే గర్వం ఇంద్రునికి ఉంది. గోకులంలో శ్రీకృష్ణుడు చెప్పగా, యాదవులు తనకు చేసే పూజలు మాని గోవర్ధనగిరి పర్వతానికి పూజలు చేశారు. దానిపై ఇంద్రుడు ఆగ్రహించి, ఉత్పాతాలు సృష్టిస్తాడు. శ్రీ కృష్ణుడు గోవర్ధనగిరిని తన చిటికిన వేలుపై ఎత్తి, గోకులంలోని సమస్త జీవకోటిని కాపాడుతాడు. ఇంద్రుడు తన తప్పును తెలుసుకొని శ్రీకృష్ణుని క్షమాభిక్ష కోరతాడు. శ్రీకృష్ణుడు అతడిని అనుగ్రహిస్తాడు.

బాల హనుమంతుడు సూర్యుడిని పండుగా భావించి మ్రింగే సమయంలో ఇంద్రుడు వజ్రాయుధంతో అతడిని గాయపరిచాడు. మూర్ఛిల్లిన హనుమంతుని చూసి అతని తండ్రి కోపించటంతో వాయువు స్థంభించింది. దేవతలందరూ కోరగా వాయుదేవుడు ప్రసన్నుడవుతాడు. దేవతలందరూ బాల హనుమంతునికి అనేక వరాలను ప్రసాదిస్తారు.

ఋగ్వేదంలో ఇంద్రుని ప్రాముఖ్యత గురించి చెప్పుకున్నాం. యజ్ఞ యాగాలలోని హవిస్సులను గ్రహించి, ఇంద్రుడు ప్రజలందరికి సకాలంలో వానలు కురిపించి, సస్య శ్యామలం చేసి వారికి సుఖ శాంతులను ప్రసాదిస్తాడు.

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

## జ్ఞాన ఖండం

- రమణ ప్రసాద్

హేమలేఖ :- నీవు మనస్సు బాహ్యవిషయాలపై పోకుండా నిగ్రహించావు. మంచిదే! ఆత్మ ఇదివరకే సిద్ధమైనందువల్ల, ఆత్మయే విజ్ఞానమైనందు వల్ల ఆత్మ జ్ఞానం కొత్తగా పొందేది కాదు. ఆత్మ ప్రాప్తి అనేది లేనే లేదు. ఇదివరకు పొందనిదైతే 'ఇప్పుడు పొందాము' అని అంటాం. ఆత్మ విజ్ఞానం అంటే ఆత్మయే! తానే! దానికి ఇతరమైన సాధన అక్కర లేదు. మనో నిరోధం ఆత్మ ప్రాప్తికి సాధనం కాదు.



కుండ మొదలైన వాటిని చీకటిలో ఉన్నప్పుడు దీపం మొదలైనవి ఆ చీకటిని తొలగిస్తాయి. అప్పుడు కుండను చూడగలుగుతాం. దీపం వల్ల కుండను చూశాం అనుకొంటాం. వాస్తవానికి దీపం చేసినపని చీకటిని తొలగించటమే! దీపం కుండను తీసుకురాలేదు. కుండ అంతకు పూర్వమే అక్కడ ఉన్నది. అయినా దీపం వల్లే అది మనకు దక్కింది. అలాగే స్వప్రకాశం, చిదేక రసం అయిన ఆత్మ పూర్వ వాసనలచే కలిగిన మనో వికల్పాల చేత ఆవరింపబడినట్లుగా ఉంది. మనస్సు నిగ్రహించినప్పుడు వికల్పాలు నశిస్తాయి. అప్పుడు ఆత్మరూపం భాసిస్తుంది.

ఒక బంగారు నగను జాగ్రత్తగా దాచి మరచిపోయారనుకుందాం. అది పోయిందని భ్రమించారు. కొంతసేపటికి ఇతరాలోచనలు తొలగి మనస్సు నిస్సంకల్పమైంది. నగ ఫలానచోట దాచినట్లు గుర్తువచ్చి, అక్కడ వెదికి, 'నగ దొరికింది' అని సంతృప్తి చెందారు. నగ కొత్తగా కనిపించలేదు. ఆవిధంగానే బాహ్యవస్తు నిరోధం వల్ల ఆత్మ భాసిస్తుంది అనే మాట సరి కాదు.

అయితే నిత్య ప్రాప్తమైన ఆత్మ ఎందువల్ల నిత్యమూ కనిపించుట లేదు? అనే సందేహం రావచ్చు. రాముడు అనే వ్యక్తితో పరిచయం

లేనంత వరకు, అతడు ఎదురుగా ఉన్నా, అతడు రాముడని తెలుసుకోలేము. అలాగే ఆత్మ పరిచయం మనకు పూర్వం లేనందువలన, మనలోనే ఉన్న ఆత్మను మనం గుర్తించలేకపోతున్నాం.

పట్టణాలకు దూరంగా ఉన్న పల్లెటూరులో రాత్రి సమయంలో అతనికి చీకటి మాత్రమే గోచరిస్తుంది. దేదీప్యమానంగా ప్రకాశించే కాంతి అతనికి తెలియదు. అట్టివాడు ఒక రాత్రి రాజ సభకు వెళ్ళి అక్కడ దీప కాంతులను చూశాడు. కాని వారు రాజ సభలో సభ్యులని, తాను చూసింది విద్యుద్దీప కాంతి అని అతనికి తెలియదు.

ఆ విధంగానే నీకు ఆత్మకు సంబంధించిన పూర్వ జ్ఞానం లేకపోవటం వల్ల ఆత్మను గుర్తించలేకపోతున్నావు. బాహ్య విషయాలను నిరోధించిన తరువాత నీకు చీకటి కనపడింది. మొదటి మనోనిగ్రహానికి, చీకటిని చూసినదానికి మధ్య, నిగ్రహము, దర్శనం లేని జ్ఞానం ఒకటి ఉంది. అదే ఆత్మ స్వరూపం. దానిని గురించే నిత్యం భావన చెయ్యి. పరమానందం లభిస్తుంది. మోహంచేత ఆవరింపబడి, బాహ్య విషయాలపైన దృష్టి కలిగి ఉన్నవారు ఆత్మ భావన పొందలేక పోతున్నారు. శబ్దార్థ బావనచేత ఆత్మను తెలుసుకోలేము. నిదిధ్యాస లేనిదే అది అంటదు. నిర్మలమైన, నిశ్చలమైన చిత్తానికే అది లభిస్తుంది. ఎంత పరిగెత్తినా తన తల యొక్క నీడను తాను పట్టుకోలేడు. అలాగే ఇంద్రియ వ్యాపారాలు ఉన్నప్పుడు అది అందదు.

ఒక అద్దం ఎంత నిర్మలంగా ఉన్నా, దానిలో అనేక వస్తువులు ప్రతిబింబిస్తుంటే, అజ్ఞాని ఆ ప్రతిబింబాలకు ఆధారమైన అద్దాన్ని చూడలేడు. అలాగే 'స్వాత్మ' అనే పెద్ద అద్దంలో జగత్తు అంతా ప్రతిబింబిస్తుంటే, ఇంతకు పూర్వం ఆత్మ అంటే ఏమిటో తెలియనందున దానిని గుర్తించలేకపోతున్నారు. ఆకాశంలో (అవకాశంలో, శూన్యంలో) ఉన్న జగత్తును చూస్తున్నా ఆకాశం అంటే పూర్వ పరిచయం లేనివారు ఆకాశాన్ని గుర్తించలేకపోతున్నారు.

-సశేషం

# ఈశ్వరునిలో మునగండి

- గాలి జగదీశ్

ఒకచోట ఒక జ్ఞాని సత్సంగం చేస్తున్నాడు. అకస్మాత్తుగా జోరుగా సుడిగాలి వచ్చింది. ఇంటిపై రేకులు టపటపా కొట్టుకుంటున్నాయి. భక్తులందరూ పారిపోయారు. దగ్గరలో ఉన్న ఇళ్లల్లో తల దాచుకున్నారు. కొంతసేపటికి సుడిగాలి ఆగిపోయింది. ప్రశాంత వాతావరణం ఏర్పడింది. భక్తులంతా మళ్ళీ తిరిగి వచ్చి చూస్తే, స్వామీజీ మాత్రం అక్కడే అలాగే కూర్చుని ఉన్నారు.

భక్తులంతా స్వామిని ప్రశ్నిస్తూ "స్వామీ! ఇంత సుడిగాలి వచ్చింది కదా! మరి మేమంతా పారిపోయాము. మీరు పారిపోలేదా?" అని అడిగారు.

స్వామి సమాధానం చెబుతూ "నాయనా! నేను కూడా పారిపోయాను. కాకపోతే మీరు బయటకి పారిపోయారు, నేను లోపలికి (ఆత్మలో) పారిపోయాను" అన్నారు.

అంతర్యామి పరమాత్మతో మీరు కలిసిపోతే, ఇక ప్రకృతి సేవ పొందటం పెద్ద విషయం ఏమికాదు. పరమాత్మతో కలిసిపొండి. ఈశ్వరునిలో మునిగిపొండి. ప్రపంచంతో పొందలేరు, కాని ఈశ్వరుడు అన్నీ చేయగలడు.

మీరు ఎప్పుడైతే సంసారం నుండి సుఖాన్ని పొందాలని కోరికను కోరుతారో అప్పుడు మీరు రెండు పైసలవాళ్ళు! అంటే విలువలేని వాళ్ళు అయిపోతారు.

సంసారం నుండి సుఖం పొందాలనే కోరికను వదిలివేసి, ఈశ్వరునిలో మునకలు కొడుతుంటే, మీరు ఈశ్వరుడే అయిపోతారు. ఇది మహాపురుషుల అనుభవం.

# జీమూతవాహనుడు

సేకరణ - మురళీ

జీమూతకేతువు అను చక్రవర్తి విద్యాధర రాజ్యాన్ని పాలిస్తుండే వాడు. ప్రజలను దయతో పాలించటమేకాక, దైవభక్తి కలవాడై విరాజిల్లే వాడు. అనేక తరాలనుండి వారి రాజ ప్రాకారములోనే కల్పవృక్షము అభివృద్ధి చెందుతూ, వారి కోర్కెలను తీరుస్తూ ఉండేది. ఆ రాజుకు సంతానం లేనందువల్ల సుగుణవంతుడైన పుత్రుణ్ణి ప్రసాదించమని ఆ కల్పవృక్షాన్ని ప్రార్థించాడు. కల్పవృక్షము 'ఓ రాజా! నీకు లోకోత్తరుడు, దాన శీలుడు, భూతదయాపరుడు, పరోపకార పారీణుడు, మహాత్యాగి అయిన పుత్రరత్నం జన్మిస్తాడు' అని ఆశీర్వదించింది. తరువాత కొద్దికాలానికే ఆ మహారాణి ఒక చక్కని మగశిశువును ప్రసవించింది. అతనికి జీమూత వాహనుడు అని పేరు పెట్టారు.

జీమూతవాహనుడు యుక్తవయస్సు వచ్చేసరికి ఉపాధ్యాయుల వద్ద సకల విద్యలు అభ్యసించాడు. అంతట రాజు అతనికి యువరాజ పట్టాభిషేకం చేసి, రాచకార్యాలన్నిటిలో తర్ఫీదు ఇచ్చాడు. ఒకరోజు అతడు తన తండ్రిని సమీపించి 'తండ్రీ! ఈ రాజ్యభోగాలన్నీ అశాశ్వతాలు. మనకు కావలసినది శ్రీహరి కృప! అతడే మనకు మోక్షాన్నిచ్చేవాడు. భగవంతుడు భూతదయ గలవారిని తన వారిగా స్వీకరిస్తాడు. పరోపకారమే దేవుని లక్ష్యము. కాబట్టి పరోపకార దీక్ష వహించాను. మన ఇంట్లో ఉన్న కల్ప వృక్షమును పరోపకారార్థమై ఉపయోగిస్తాను' అని అనుమతిని కోరాడు.

అందుకు ఆ మహారాజు ఆనందంగా అనుమతినిచ్చాడు. జీమూతవాహనుడు తన దేశం నుండి దరిద్రదేవతను తొలగించమని ఆ కల్పవృక్షాన్ని కోరాడు. వెంటనే ఆ దేవతా వృక్షము కనక వర్షాన్ని కురిపించగా, దేశ ప్రజలంతా దారిద్ర్యము లేక సుఖంగా కాలం గడుపుతున్నారు.

జీమూతకేతువు ముసలివాడైనందున కుమారుని రాజ్యాభిషిక్తుని చేసి, తపస్సు చేసుకోవటానికి మలయ పర్వతం చేరుకున్నాడు. జీమూతవాహనుడు రాజ్యాన్ని మంత్రులకప్పగించి, తల్లి దండ్రుల సేవచేసుకోవటానికి వారి వెంట వెళ్ళాడు.

జీమూతవాహనుడు సకల రాజ్యభోగములను తృణప్రాయంగా తలచి, అరణ్యవాసం చేస్తూ, తల్లిదండ్రుల సేవ చేసుకోసాగాడు. సమయం కోసం ఎదురుచూస్తున్న విద్యాధర వంశజుడగు మతంగుడు సైన్యంతో వచ్చి వారి రాజ్యమును ఆక్రమించాడు. జీమూతవాహనుడు విషయం తెలిసి కూడా రాజ్యం శాశ్వతం కాదని రాజ్యకాంక్షను వదలి తల్లిదండ్రుల సేవ చేసుకుంటున్నాడు.

తల్లిదండ్రుల ఆశ్రమాన్ని మరొక ప్రదేశానికి మార్చటంకోసమని, వెదకుతూ, ఒకసారి జీమూతవాహనుడు మలయపర్వతంపైకి ఎక్కాడు. మార్గమధ్యంలో ఒక దివ్యతపోవనం చూసి అందులోకి ప్రవేశించాడు. అక్కడ ఆలయంలో మలయవతి అనే త్రిలోకసుందరి వీణానాదం చేస్తున్నది. మలయవతి, జీమూతవాహనుడు ఒకరినొకరు చూసుకుని, ప్రేమానురాగాలకు లోనై, వివాహం చేసుకుని సుఖంగా సంసారం చేసుకుంటూ కాలం గడుపుతున్నారు.

-సశేషం

## *సమర్ధ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా సెప్టెంబరు 2017, అక్టోబరు 2017 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి

సెప్టెంబరు 2017: AS 4306, 5708, 6717, 7157, 7161, 7167, 7170, 7331, 7357
AS 7358, 7359, 7360, 7364, 7365, 7366.

అక్టోబరు 2017: AS 1109, 4032, 6448, 6531, 6535, 6566, 6575, 6576,6577,
AS 6769, 6909, 7174, 7179, 7184, 7367, 7368, 7369, 7370,
AS 7371, 7372, 7373, 7374,7377, 7378, 7379, 7382, 7383.

– మేనేజర్

# ముండకోపనిషత్తు

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

తృతీయ ముండకం - ప్రథమ ఖండం

ప్రాణ స్నేహితులైన రెండు పక్షులు ఒకే చెట్టుపైన కూర్చొని వున్నాయి. వాటిలో ఒకటి చెట్టు పళ్ళను ఆసక్తితో తింటోంది. మరొకటి ఏమీ తినకుండా చూస్తోంది. వాటిలో ఒకటి జీవాత్మ. అజ్ఞానంలో మునిగి దుఃఖిస్తోంది. కాని ఆరాధనీయమైన ఆత్మను, దాని వైభవాన్ని చూసి దాని దుఃఖం తరిగిపోతోంది.

స్వయం ప్రకాశమైన బ్రహ్మ, సర్వ జగత్తుకు కర్తయైన పరమాత్మను చూడగానే సాధకుడు సర్వోత్కృష్టమైన స్థితిని పొందుతాడు. ఆతడే సకల జీవులలో ప్రకాశించే ఈశ్వరుడు. పాపరహితులు, కల్మష రహితులు మాత్రం ఆ ఆత్మను దర్శిస్తారు. సత్యవాదులే జయిస్తారు. ఋషులు సత్యమార్గంలో పయనించి హృదయస్థమై ఉన్న దానిని ఈ జన్మలోనే సాక్షాత్కరించుకొని పరమ పదాన్ని చేరుతారు.

ఆత్మను మాటలలో వర్ణించలేము. దానిని కళ్ళు చూడలేవు. ఇంద్రియాలు గ్రహించలేవు. తపస్సుతో, కర్మలతో తెలుసుకోలేము. పరి శుద్ధమైన మనస్సుతో ధ్యానం చేసి తెలుసుకోగలుగుతాడు. అట్టి శుద్ధ సత్త్వుడు ఏ లోకాలను కోరుకొంటాడో ఆయా లోకాలను పొందుతాడు. ఏ కోరికలు కోరినా అవి అతనికి తక్షణమే సిద్ధిస్తాయి.

తృతీయ ముండకం - ద్వితీయ ఖండం

ఆత్మ సాక్షాత్కారం పొందినవాడు ఉజ్జ్వలంగా ప్రకాశించేది, జగత్తుకు ఆధారమైనది అయిన ఆత్మను తెలుసుకొంటాడు. ఆతనికి ఇక పునర్జన్మ ఉండదు. ఇంద్రియభోగాలకోసం ఆరాటపడేవారు, ఆ కోరికలు తీరేవరకు దానికి అనుగుణమైన జన్మలు ఎత్తుతారు. కాని కోరికలను జయించిన ఆత్మ జ్ఞానికి ఈ జన్మలోనే కోరికలు సమసిపోతాయి.

ఉపన్యాసాలు ఇవ్వటం వలనగాని, శాస్త్రాధ్యయనం వలనగాని ఆత్మప్రాప్తి కలుగదు. తీవ్ర ఆరాటంతో సాధన చేసేవాడికే ఆత్మ బ్రహ్మైక్య పదం లభిస్తుంది. ఆత్మ లాభం పొందిన ఆత్మ జ్ఞానులు నిస్సంగులుగా, సర్వవ్యాపియైన బ్రహ్మను ఎల్లెడల దర్శించుకొంటారు.

వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా : సన్యాసయోగాద్

యతయః శుద్ధ సత్త్వాః।

తే బ్రహ్మలోకేషు పరాన్త కాలే పరామృతాః పరిముచ్యంతి సర్వేః॥

వైరాగ్యమయమైన జీవనంద్వారా, నిరంతరాభ్యాసం ద్వారా పవిత్రులై, పరమాత్మ యందు సుస్థిరులైనవారు అమరులవుతారు.

పొంగి ప్రవహించే నదులు వాటి ఆకారాలను కోల్పోయి సముద్రంలో ఏకమైనట్లు, జ్ఞాని తన నామ రూపాల నుండి ముక్తుడై సర్వోత్కృష్టమైన పరబ్రహ్మ తత్త్వంలో లీనమవుతాడు. ఆ పరబ్రహ్మ తత్త్వాన్ని తెలుసుకొన్న వాడు పరబ్రహ్మమే అవుతాడు. దుఃఖ రహితుడై అమరత్వాన్ని పొందుతాడు.

అట్టి వేద పారంగతుడు, శ్రద్ధావంతుడు అయినవానికే ఈ బ్రహ్మవిద్యను ఉపదేశించాలి.

తదేతత్ సత్యమృషిగిరాః। పురోవాచ నైతద చీర్ణ వ్రతో ధీతే।

నమః పరమ ఋషిభ్యో। నమః పరమ ఋషిభ్యః॥

ఇదే పరమ సత్యం. ఈ సత్యాన్నే అంగీరసుడు తన శిష్యులకు ఉపదేశించాడు. మహాఋషులారా! మీకు నమస్సులు. మహాఋషులారా! మీకు నమస్సులు.

**SUBSCRIPTION NOTIFICATION FOR ENGLISH (QUARTERLY) AND TELUGU(MONTHLY) SAMARDHA SADGURU MAGAZINES**

TELUGU MAGAZINE LIFE MEMBERS ARE REQUESTED TO BECOME 'MAHARAJA POSHKULU' AND 'RAJA POSHAKULU' BY DONATING RS.11116/- AND 5116/- RESPECTIVELY.

WE ALSO APPEAL LIFE AND ANNUAL SUBSCRIBERS TO BECOME LIFE MEMBERS BY REMITTING RS.1116/- THIS WILL BE OF GREAT HELP TO MEET THE INCREASE IN COSTS OF VARIOUS INPUTS.

WE ALSO REQUEST THE DEVOTEES TO SUBSCRIBE FOR SAMARDHA SADGURU QUARTERLY ENGLISH MAGAZINE. SUBSCRIPTION FOR ENGLISH MAGAZINE IS RS 100/- FOR FIVE YEARS.

REMITTANCES SHOULD BE MADE IN THE NAME OF Y.S.C.K.P.M CHARITABLE TRUST-A/C SAMARDHA SADGURU MAGAZINE BY M.O/DRAFT/MAIL TRANFER

SAMARDHA SADGURU MANAGEMENT

# ఆత్మసాక్షాత్కారము

- రమణ ప్రసాద్

ఆత్మయందు మనస్సు స్థిరంగా నిలిస్తే మనస్సు నిర్విషయ మవుతుంది. అదే బంధ విముక్తి. అదే మోక్షము. మనస్సు నిశ్చలమైనప్పుడు ఆత్మ ప్రకాశాన్ని దర్శించగలుగుతాం. అదే మన సహజ స్థితి. సహజ స్థితిలో నిలకడగా ఉండటమే ముక్తి.

**శ్లో॥ హృదయకుహర మధ్యే కేవలం బ్రహ్మమాత్రం।**
**అహమహమితి సాక్షాదాత్మరూపేణ భాతి॥**
**హృది విశ, మనసాస్వచిన్వతా, మజ్జతావా।**
**పవన చలనరోధాదాత్మ నిష్ఠో భవత్వం॥**

"నేను, నేను అనేదే ఆత్మ, లేక బ్రహ్మము. "నేను ఎవరు? అని విచారణ చేయాలి. "నేతి, నేతి (నేను ఇది కాదు, ఇది కాదు) అని, ఒక్కొక్క దానిని నిషేధించగా మిగిలేది ఏదో అదే ఆత్మ(బ్రహ్మం) అని బోధించారు శ్రీ రమణ మహర్షి.



పై శ్లోకాలలో బ్రహ్మను తెలిసికొనే మార్గాలు మూడు చెప్పారు. అవి:

1. ఎప్పుడూ బ్రహ్మాకార వృత్తిలో వుండటం. మనస్సును శ్వాసపై నిలపటం ద్వారా మనస్సు నిర్విషయమై ఆత్మ ప్రకాశాన్ని దర్శించ గలుగుతావు. మనస్సు చలిస్తే మళ్ళీ మళ్ళీ మనస్సుతో శ్వాసను గమనించాలి. మనోలయం కావటంతో ఆత్మ సాక్షాత్కారం అవుతుంది. అదే ఆత్మాన్వేషణ.

2. ఆత్మ ప్రకాశంలో మనస్సుని లయం చేయటం. హృదయకుహరంలో ప్రకాశమైన కాంతిని దర్శిస్తూపోతే మిగిలేది "తానే" అనే అనుభవం కలుగుతుంది.

3. శ్వాసను నిరోధించటం (కేవల కుంభకం) వల్ల మనస్సు ఆత్మలో లయమవుతుంది. దీనికి "సోహం" జపం ఉపయోగ పడుతుంది. శ్వాస తీసికొన్నప్పుడు "సో" అని, శ్వాస విడిచినప్పుడు, "హం" అని జపం చేయాలి. అలా చేయగా, చేయగా శ్వాస ఏ ప్రయత్నం లేకుండానే నిలిచిపోతుంది. మనోలయమై ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది.



**శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ హాస్పిటల్లో శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా వార్షికోత్సవం 16-8-2017**

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

శిఖిధ్వజుడు మరల ప్రశ్నించాడు, "ఓ మునీ! ఈ మనసేమిటి? దీని సహజ స్వభావమేమిటి, ఈ మనసుకు కారణభూతమైన దేమి? ఈ తుంటరి మనస్సును నేనెలా నిర్మూలం చేయగలను?"

కుంభముని సమాధానము చెప్పాడు "మనసనేది వాసనల సముదాయము. వాసనలు కలిగి యుండటమే మనసు యొక్క సహజ స్వభావము. మనసు, వాసన వొకటికొకటి పర్యాయ పదాలు. వాసనలు, లేక సూక్ష్మమైన కోరికలను రహితం చేసుకోటం చాలా కష్టమైన పని. అహంకారమనేది మనసనే వృక్షమునకు బీజములాంటిది. శరీరము యొక్క కదలికలకు మనసే కారణము, అది హృదయము చుట్టూ వాలే తేనెటీగ లాంటిది. అహంకారమనే బీజము నుండి మొలకెత్తే మొక్కలాంటిది బుద్ధి. ఈ శరీరము మనసనే వృక్షమునకు కొమ్మలాంటిది. సంకల్పాలు దాని నుండి విస్తరించే శాఖల వంటివి అవన్నీ బుద్ధియనే మొక్క నుండి వుద్భవిస్తాయి.



మనసు తాను చేసే క్రియాకలాపము నుండి మనో బుద్ధి, చిత్తహంకారములనే నాలుగు రూపాలుగ విభజింపబడ్డాయి. సంకల్పములతో కూడినది మనసంటాము. అది వొక వస్తువు లేక విషయాన్ని గుర్తుపెట్టుకొన్నప్పుడు చిత్తమంటాము. అది నిశ్చయము చేసినప్పుడు బుద్ధి అంటాము. సంకల్పము క్రియా రూపందాల్చి, గర్వించినప్పుడు అహంకారమంటాం, నిత్యమూ మనసనే వృక్షము యొక్క కొమ్మలను నరికివేస్తూ, చివరకు ఆ వృక్షాన్ని ఆమూలాగ్రం నశింపచేయాలి, కొమ్మలను నరికి వేయటం ప్రధానంకాదు.

ప్రమాదకరమైన చెట్టును మొదలంట నరికివేయటమే ప్రధాన లక్ష్యంగా వుండాలి. వాసనలనే కొమ్మలనుండి, కర్మలనే అసంఖ్యాకమైన పంటలు వస్తాయి. వాసనలను జ్ఞానమనే ఖడ్గముతో ఛేదించాలి. మనసనే వృక్షము యొక్క బీజమైన అహంకారమును దహింపచేయాలి. అప్పుడు నీవు పరమ శాంతిని పొందుతావు."

శిఖిధ్వజుడు మరల యిలా అన్నాడు, "ఓ పూజ్యమునీ! బ్రహ్మ జ్ఞానము, లేక ఆత్మ జ్ఞానము మనసనే వృక్షమును దహింపచేసే అగ్ని. "నేనెవరు" "నేను యొక్క నిజమైన స్వభావమేమిటనే విచారణ వలన లభ్యమయ్యేది ఆత్మ జ్ఞానము".

శిఖిధ్వజుడు మరల సంభాషణ కొనసాగించాడు "ఓ కుంభమునీ! 'నేను' యొక్క వునికి (ఆరంభము)ని గురించి అనేక కోణాలనుండి అనేక మాట్లు మరల మరల విచారించాను. నేను శరీరాన్ని కాను, ప్రాణమును కాను, మనసును, బుద్ధిని కాను యింద్రియాలను కాను, అహంకారాన్ని కాను." అప్పుడు కుంభముని యిలా ప్రశ్నించాడు, "ఇవేమి నీవు కాకపోతే, నిన్ను గురించి వాస్తవం నీవేమి ఆలోచిస్తున్నావు? ఇవేమి 'నేను కాదనుకొంటే, అదియేమిటి?"

శిఖిధ్వజుడిలా సమాధానం చెప్పాడు, "ఓ మునీశ్వరా! నేను తెలివైన పవిత్రమైన ఆత్మ లేక సంపూర్ణమైన ఎరుకగా భావిస్తాను. నేను మనసు యొక్క బీజమైన అహంకారమును రహితము చేసుకోలేక పోతున్నాను, దానిని వదిలించుకోవలనని ప్రయత్నించే కొలది, అది మరీ అతుక్కుపోతుంది."

కుంభముని యిలా చెప్పాడు, "ప్రతికార్యమునకు లేక ఫలితమున కొక కారణముంటుంది. ఇది యెక్కడైనా ప్రకృతి యొక్క సహజన్యాయము. అహంకారమునకు కారణమేమిటో తెలుసుకో, ఆ కారణమును పరిశీలించి, అదేమిటో తెలుసుకో."

శిఖిధ్వజుడిలా సమాధనము చెప్పాడు, "నా అహంకారమునకు మాయే కారణము, ఓ దివ్యకుమారా! బాహ్య వస్తువులపై ఆకర్షింపబడే నా ఆలోచనలనెలా విసర్జించగలనో తెలియజేయండి, బాహ్యంగా కనిపించే రూపాలను, నామాలను యెలా విసర్జించాలి?"

కుంభముని యిలా అన్నాడు "నీవు నీ విజ్ఞానము యొక్క కారణాన్ని చెప్తే, నేనప్పుడు దానికి గల కార్యకారణములను వివరించి, ఆలోచనలనణచి వేసి, అహంకారమును నిర్మూలము చేసే విధానమును తెలియజేస్తాను."

శిఖిధ్వజుడిలా చెప్పాడు, "విజ్ఞానము మాయా జనితమైన వస్తువుల వలన కలుగుతున్నది, శరీరము, చెట్టు, నదులు, పర్వతములు, ఆవు, గుర్రము మొదలైనవి. ఆ వస్తువులకు వునికి లేకపోతే, ఆ వస్తువులను గురించిన జ్ఞానమెలా వుంటుంది? అప్పుడు మనో బీజమైన అహంకారమునకు తావులేదు."

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2017**

05 మంగ - టీచర్స్ డే - శ్రీ సద్గురు పాద పూజ, గురుకుల సాంస్కృతిక కార్యక్రమాలు.

06 బుధ - భాద్రపద పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ.

15 శుక్ర - శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

18 సోమ - మాస శివరాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

20 బుధ - అమావాస్య.

సెప్టెంబర్ 21 గురువారం నుండి అక్టోబర్ 2 వ తేదీ సోమవారం వరకు శ్రీ శరన్నవరాత్ర మహోత్సవములు.

21 గురు - దీక్షా స్వీకారం, అఖండ జ్యోతి ప్రజ్వలనము.

27 బుధ - మూలా నక్షత్రం, శ్రీ సరస్వతీ పూజ.

28 గురు - శ్రీ దుర్గాష్టమి .

29 శుక్ర - మహర్నవమి, శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

30 శని - విజయ దశమి -శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు.

**అక్టోబర్ 2017**

01ఆది - ఏకాదశి - ఏకాహం, దీక్షా విరమణ, బీజ పూరిత మంత్రాక్షలతో శ్రీ మాతాజీ వారి ఆశీర్వచనము. రాత్రి 7 గం॥లకు శ్రీ జగన్మాత నగరోత్సవము (ఊరేగింపు).

02 సోమ - రాత్రి 8 గం॥లకు శ్రీసద్గురుపాదపూజా మహోత్సవం.

05 గురు - ఆశ్వయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14 శని - శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

18 బుధ - నరక చతుర్దశి, మాసశివరాత్రి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం. , పావులూరు శాఖలో ఏకాహం

19 గురు - దీపావళి అమావాస్య - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

23 సోమ - నాగుల చవితి- అక్టోబర్ 22 నుండి నవంబర్ 1 వరకు ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వరస్వామివారికి పంచామృతములతో, నవరసాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

భగవంతుడు నీకు భిన్నంగా ఉన్నాడని చింతన చేస్తే, నీకు చింత తప్పదు సుమా! అది పరోక్ష జ్ఞానము. అది ఉన్నంతవరకూ సందేహాలు తప్పవు. భగవంతుడు నాలోనే ఉన్నాడని భావనచేసేవారికి చింత ఎక్కడిది? అది అపరోక్షానుభూతి. గోపికలు కృష్ణ పరమాత్మను దర్శించ కుండా ఉండలేరు. ఆయన భాషణ శ్రవణం చేయనిదే మనశ్శాంతి లేదు. ఆయన స్పర్శ పొందనిదే ప్రశాంతత లేదు. అందువలననే వారు



శ్రీకృష్ణపరమాత్మను **పరను** ప్రసాదించమని కోరుకున్నారు.

**పర** అంటే భగవానుడు నీకు భిన్నంగా లేడు అని తెలియజేసే పరికరము. అందువలననే శ్రీకృష్ణపరమాత్మ వారికి ఓం కృష్ణా! ఓం కృష్ణా! కృష్ణాయ నమః అనే మంత్రాన్ని ఉపదేశించి, పర తత్త్వాన్ని అందజేసి, పరబ్రహ్మము నీకు భిన్నంగా లేడు. నీలోనే ఉన్నాడనే జ్ఞానాన్ని ప్రబోధింపజేసి, వారిని వదిలి వెళ్ళిపోయాడు. ఆయన ఎక్కడికి వెళ్ళాడు? ఆయన సర్వవ్యాపకుడు. ఆయన లేని స్థలం ఉందా?

ఆత్మవస్తువులో ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అనుక్షణము అనుసంధానము పొందుతున్న మనస్సు పరభావనలో ఉండటం వలన ఆనందాన్ని పొందలేక పోతున్నాడు. ఆ స్థితిని పొందాలంటే గోపికలలాగ సద్గురుమూర్తి సమాశ్రయాన్ని పొందాలి. ఆయన బోధా శ్రవణం ద్వారా బుద్ధి ప్రేరణ చెంది, వివేకవంతమై, నిత్యానిత్యవస్తు వివేకము కలుగుతుంది. సాధన మార్గంలో అది ప్రథమ సోపానము.

ఆ క్షణమే సాధకునికి తనలో ఉన్న అసంపూర్ణత వెలితిని గుర్తించి, శాశ్వత ఆనంద స్థితిని పొందాలన్న వాంఛ అనురక్తి కలుగుతుంది. అది జ్ఞానమార్గంలో పయనిస్తున్నాడనటానికి సంకేతం. బుద్ధి వివేకవంతమైతేనే మనస్సులో సత్సంకల్పాలకు అవకాశం కలిగి ఉదాసీనతకు మార్గం సుగమం అవుతుంది. అదే వైరాగ్యము. మనస్సు ప్రాపంచిక సుఖభోగాలను కోరదు. ప్రాపంచిక ఆకర్షణలకు స్పందించదు. అది ఆరూఢమైతే ఇంద్రియ సంయమనం చేకూరుతుంది. అదే శమాది

షట్కసంపత్తి. మనస్సు స్థిరపడితేనే ఇంద్రియ సంయమనం సాధించ గలుగుతాడు. కదిలకలతో కూడిన మనస్సు ఎన్నడూ స్థిరపడదు.

ధ్యానంలో మనస్సు నిలబడటంలేదని ఎవరైనా సాధకులు సద్గురుదేవులకు విన్నవించుకుంటే, “నా సన్నిధిలో బోధా శ్రవణం చేస్తూ మనస్సు కదలికలు లేకుండా ఆనందంగానే ఉంటోంది కదా! నా సన్నిధిని వదలి బయటకు వెళ్లిన తరువాత మనస్సు స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ విచ్చలవిడిగా ఉంటోంది కదా. మరి మీ మనస్సు ఎలా నిలబడుతుంది?” అని ప్రశ్నించేవారు. “అందువల్ల నా సన్నిధిని వదలి వెళ్లిన తరువాత విచారణ చేయండి. మనస్సుని ప్రశ్నించండి. విచారణ ద్వారా మనస్సులో వృత్తి రహితమవుతుంది. దాని ద్వారా మనస్సులో భక్తి, లేక ప్రేమ ఆరూఢం అవుతుంది. ఆ స్థితిని సాధించిన సాధకుడు తప్పక కృతార్థుడవుతాడు” అన్నారు శ్రీ సద్గురుదేవులు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2017**

06 బుధవారం - భాద్రపద పౌర్ణమి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ

15 శుక్రవారం - శ్రీగురుదశమి, రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ

27 బుధవారం-మూలా నక్షత్రం, సరస్వతీ పూజ; ఉదయం 11గం.లకు కుంకుమ పూజలు.

28 గురువారం- దుర్గాష్టమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ.

29 శుక్రవారం- మహర్నవమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ

30 శనివారం - విజయ దశమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ, శ్రీసద్గురుపాదపూజ.

**అక్టోబర్ 2017**

05 గురువారం- ఆశ్వయుజ పౌర్ణమి; శ్రీ మాతాజీ జన్మదిన మహోత్సవం - రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14శనివారం- శ్రీ గురుదశమి - రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాద పూజ

18 బుధవారం - నరకచతుర్దశి

19 గురువారం - దీపావళి.

# నారద ముని కలహ ప్రియుడా?

- రమణ ప్రసాద్

నారదుడు కలహ ప్రియుడా? కాదా? అనే విషయం తెలుసుకునే ముందు నారదుని కృష్ణ భక్తి గురించి తెలుసుకొందాం:

"నేను పూర్వజన్మలో ఒక దాసీస్త్రీకి పుట్టాను. మా తల్లి వేదవిదులైన బ్రాహ్మణుల ఇంట్లో పని చేస్తూ ఉండేది. ఆ రోజుల్లో నేను చాతుర్మాస దీక్షలో ఉన్న కొందరు యోగులకు సేవ చేయటం జరిగింది. వారిని నేను ఎంతో భక్తితో సేవిస్తూ వుండేవాడిని. వారు కృష్ణ చరితలు వర్ణిస్తూ పాడుతుంటే, నాకు వీనుల విందుగా ఉండేది. అది కారణంగా నాలో భగవద్భక్తి జనించింది. దానితో పాటు వినయం, మితభాషిత్వం, ఇంద్రియ నిగ్రహం అలవడినాయి. ఈ విషయం గ్రహించిన యోగులు నాకు ఈశ్వర రహస్యాన్ని ఉపదేశించారు."




"విధి బలీయం. ఆ కారణంగా నన్ను కంటికి రెప్పగా కాపాడుతున్న నా తల్లి మరణించింది. నేను ఇల్లు వదిలి పరమేశ్వరుడే సర్వస్వంగా కాలం గడుపుతున్నాను. నాకు ధ్యానంలో శ్రీహరి పొడగట్టాడు. నాకు ఆయన మధురవాణి వినిపించింది-"నాయనా! నువ్వు నన్ను ఈ జన్మలో చూడలేవు. వచ్చే జన్మలో నా భక్తుడవై జన్మిస్తావు. నేను నా దాసీ పుత్ర శరీరాన్ని విడిచి మరీచి మొదలైన మునులతో పాటు జన్మించాను. నాకు ఈశ్వరుడు ఈ వీణను ప్రసాదించాడు. నేను నారాయణ కథాగానం చేసుకుంటూ ముల్లోకాలలో సంచరించటం నా నిత్యకృత్యమయింది."

నారదుడిని కలహ ప్రియుడు, కలహ భోజనుడు అంటారు. కాని అది నిజం కాదు. అతడు చేసినవన్నీ కళ్యాణ కారకమే అయినాయి:
పసిబాలుడైన ధృవుని దృఢ సంకల్ప దీక్షకు మెచ్చి, అతనికి "ఓం నమో

భగవతే వాసుదేవాయ" అనే ద్వాదశాక్షర మంత్రాన్ని ఉపదేశించి, అతడికి విష్ణు సాక్షాత్కారం కలిగేటట్లు చేశాడు. హిరణ్యకసిపుడు తపస్సులో వుండగా, అతని భార్య లీలావతిని తన ఆశ్రమంలో ఉంచుకుని ప్రహ్లాదుని కనేవరకు సంరక్షించాడు. తల్లి గర్భంలోనే "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరి మంత్రాన్ని వుపదేశించి, ప్రహ్లాదుడి ద్వారా హిరణ్యకసిపుడికి విష్ణు అవతారమైన నరసింహుని చేతిలో మరణం ప్రాప్తించేటట్లు చేశాడు. బోయవానికి రామ మంత్రం ఉపదేశించి అతడు రామాయణ కావ్య రచనకు కారణభూతుడయినాడు. ఆయనే వాల్మీకి మహర్షిగా ప్రసిద్ధి గాంచాడు. వేదవ్యాసుని నిర్వేదాన్ని పోగొట్టి అతని చేత భక్తి రస ప్రధానమైన భాగవత రచనకు కారకుడైనాడు. త్యాగరాజుకు దర్శనమిచ్చి, తన కీర్తనల ద్వారా రాముని పొందేటట్లుగా చేశాడు. సతీ అనసూయ పాతివ్రత్యం లోకానికి తెలిసేటట్లు చేసి చంద్రుడు, దత్తాత్రేయుడు దుర్వాసుల అవతరణ జరిగేటట్లుగా చేశాడు. దత్తాత్రేయుడు మిగిలిన ఇద్దరి శక్తులను తీసికొని మానవులు పరమాత్మను చేరే విధానాన్ని బోధించి దత్తాత్రేయ గురువుగా ప్రసిద్ధి గాంచాడు. రావణాసురుడు శివుని ఆత్మ లింగాన్ని లంకకు తీసుకు వెళ్ళకుండా చేశాడు.

విష్ణుమూర్తి ద్వారా నారదుడు తెలిసికొన్న సత్సంగ మహిమ: నారదుడు ఒకసారి వైకుంఠానికి వెళ్ళి శ్రీమన్నారాయణునితో, "ప్రభూ! సాధు సందర్శనభాగ్యాన్ని గురించి వివరించండి." అన్నాడు. "ఋషివరా! దీనికి సమాధానం ఒకచోట ఉన్న చీమ చెబుతుంద"ని విష్ణుమూర్తి అనగా, నారదుడు ఆ చీమ ఉన్న చోటుకి వెళ్ళి ఆ చీమను చేతిలో తీసికోగానే ఆ చీమ ప్రాణం విడిచింది. నారదుడు ఖిన్నుడై ఈ సంగతి నారాయణునికి తెలిపాడు. "నారదా! కైలాసంలో మానస సరోవరంలో వున్న రాజహంస దీనికి సమాధానం చెబుతుంది" అన్నాడు విష్ణుమూర్తి. నారదుడు రాజహంసను చేరగానే రాజహంస అతని ఒడిలో మరణించింది. తిరిగి ఈ విషయం విష్ణుమూర్తికి విన్నవించగా, "ఇప్పుడే ఒక శిశువు వారాణాసిలో జన్మిస్తున్నాడు. అతడు నీ సందేహం తీరుస్తాడు" అన్నాడు. నారదుని చూడగానే ఆ బాలుడు నమస్కరించి, "ఋషివరా ! స్వాగతం! ఆ చీమను నేనే. మీ దర్శనభాగ్యం చేత నాకు రాజహంస జన్మ లభించింది. తిరిగి ఇప్పుడు మానవజన్మ వచ్చింది" అన్నాడాబాలుడు. నారదుడు తిరిగి విష్ణుమూర్తి వద్దకు వెళ్ళలేదు.

నారదుడిని ఒక తపస్వి, "నారదా! ఇప్పుడు నారాయణుడు ఏం

చేస్తున్నాడు? అని అడిగాడు. "ఒక ఏనుగును సూది బెజ్జంలోకి ఎక్కిస్తున్నాడు" అన్నాడు నారదుడు. "ఔనౌను! భగవంతునికి సాధ్యం కానిది ఏదీ లేదు" అన్నాడు భక్తుడు. చూశారు కదా! నారదుడు మానవులలో ఏ విధంగా భక్తి విశ్వాసాలు కలుగజేశాడో! ఏ రీతిగా ఆయన లోకకళ్యాణానికి పాటుపడ్డాడో! అట్టి విష్ణు భక్తి తత్పరుడు నారదుడు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

సెప్టెంబర్ 2017 - 4సోమ -10ఆది - శ్రీమాతాజీవారి సత్సంగ సమావేశాలు.

06 బుధవారం - భాద్రపద పౌర్ణమి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

15 శుక్రవారం - శ్రీ గురు దశమి, సాయంత్రం 5గం॥ల 30 నిలకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

27 బుధవారం - మూలా నక్షత్రం, సరస్వతీ పూజ, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

28 గురువారం- దుర్గాష్టమి - సాయంత్రం 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

29 శుక్రవారం - మహర్నవమి. సాయంత్రం 5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

30 శనివారం విజయ దశమి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

అక్టోబర్ 2017

05 గురువారం - ఆశ్వయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

14 శనివారం - శ్రీ గురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

18 బుధవారం - నరక చతుర్దశి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

19 గురువారం- దీపావళి - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

23 సోమవారం - నాగుల చవితి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

31 మంగళవారం- చిలుక ఏకాదశి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము 72వ శ్లో॥

రామో నామ బభూవ హుం తదబలా సీతేతి హుం
తేపితుర్వాచా పఞ్చవటీ తటే విహరస్తస్యాహర ద్రావణః
నిద్రార్థం జననీ కథామితి హరేర్హుఙ్కారతః శ్రుణుత్వః
సౌమిత్రే క్వ ధనుర్ధనురితి వ్యగ్రాగిరః పాన్తువః ॥

తాత్పర్యము -



శ్రీకృష్ణుని నిదురబుచ్చుట కొరకు యశోద కథను చెబుతూ, "కన్నయ్యా! రాముడనే రాజుండెను. 'ఊఁ'. వాని భార్య పేరు సీత. 'ఊఁ'. తండ్రి ఆజ్ఞ చేత పంచవటి చెంతలో తిరుగుచున్న వాని యొక్క భార్య సీతను రావణుడనే రాక్షసుడు దొంగిలించెను. ........" ఇలా నిదురబుచ్చటానికి యశోద కథ చెబుతుండగా రామ కథను ఊఁ కొటుతూ వింటున్న శ్రీకృష్ణుని యొక్క 'లక్ష్మణా! నా విల్లు ఎక్కడ? నా విల్లు ఎక్కడ?' అని పరవశములైన మాటలు మనలను రక్షించుగాక!!

ఇరుగు పొరుగు గోపెమ్మలు ఇళ్ళలో నుండి పెరుగు చిలుకుతున్న చప్పుళ్ళకు యశోదమ్మకు మెలకువ వచ్చేసింది. లేచి తను కూడా గబగబా పనులు పూర్తిచేసుకుందామని లేవబోయేసరికి పక్కలో ఉన్న కన్నయ్య ఆవిడ కొంగుపట్టుకుని ఆవిడను లేవనీయటం లేదు. జో కొట్టినా పడుకోవటం లేదు.

అప్పుడు యశోదమ్మ పైన శ్లోకంలో తెలిపిన కథను చెబుతుంటే 'ఊఁ' కొడుతూ వింటున్న కన్నయ్య విల్లెక్కడ? ధనస్సెక్కడ? అనే కేకలు విని లోపలికి ప్రవేశించిన నీలవేణి అనే గోపిక "కన్నయ్యా! అప్పుడు రాముడు తన ధనస్సు తీసుకుని రావణుని సంహరించి, సీతను వెనక్కు తెచ్చి, అయోధ్యలో సీతాసమేతంగా పట్టాభిషేకం చేసుకున్నాడు లేవయ్యా!" అని కథను పూర్తి చేస్తే అప్పుడు కన్నయ్య పడుకున్నాడు.

# రాధ భక్తి

- రమణ ప్రసాద్

**రాధాశక్తి బినా న కోయీ- శామల దరసన్ పావే।**

**ఆరాధన్ కర్ రాధే రాధే - కాన్హా భాగే ఆయే ॥**

"శ్యామ సుందరుని దర్శనం పొందాలంటే రాధను ఆరాధించాలి. నువ్వు రాధే! రాధే! అని పిలిస్తే, కన్నయ్య పరుగు పరుగున వస్తాడు."

రాధా కృష్ణులు దివ్యాత్మ స్వరూపులు. కృష్ణుడు పురుషుడు, రాధ ప్రకృతి. వీరి వల్లనే సృష్టి క్రమం సాగుతోంది. వీరిది విడదీయలేని దివ్య ప్రేమానురాగ బంధము. రాధకు కృష్ణునిపై గల భక్తిని వర్ణించటానికి మాటలు చాలవు.



కృష్ణుడు పుట్టగానే వసుదేవుడు అతడిని గోకులానికి తీసుకు వచ్చి నంద యశోదలకు అప్పగించినప్పుడు అక్కడనే ఉన్న రాధ కృష్ణుడిని ప్రధమ వీక్షణంలోనే చూసింది. అతడిని పరమాత్మగా గుర్తించింది. ఇతడే నా నాధుడు అని నిశ్చయించుకుంది. అతడినే తన ఆరాధ్య దైవంగా కొలిచింది. ఉత్తర భారతంలో కృష్ణాష్టమికి 15 రోజులు ముందు రాధాష్టమి పండుగను అత్యంత వైభవంగా ప్రజలు జరుపుకుంటారు. రాధ ఉండేది మధుర దగ్గర ఉన్న 'బర్సానా' అనే ఊరు.

ఒకనాడు రాధ బృందావనంలోకి ప్రవేశించబోతుంటే అక్కడ ఉన్న కాపలాదారు అడ్డగించాడు. రాధ కారణం అడిగితే, "బృందావనంలో స్త్రీలకు ప్రవేశం లేదు" అన్నాడు. రాధ ఫక్కున నవ్వి ఇలా అంది, "నువ్వు బృందావనంలో ఉంటే, నేను కూడా బృందావనంలో ఉండగలను." అంది. అతడు, నేను పురుషుడిని, నువ్వు స్త్రీవి." అన్నాడు. " విశ్వంలో కృష్ణుడు ఒక్కడే పురుషుడు. మిగిలినవారందరూ స్త్రీలే" అంది. ఆమె వెనకే వస్తున్న కృష్ణుడు ఈ మాటలు విని, "నా ఆజ్ఞను ఉల్లంఘించి

నువ్వు బృందావనంలో ప్రవేశించావు. అందుకు నువ్వు జరిమానా చెల్లించాలి." అన్నాడు. రాధ, "ప్రభూ! నా హృదయమే నీ అధీనం. అది నీకు జరిమానాగా ఇస్తాను. కృష్ణుడు, "రాధా! ఈ బృందావనం విరిసింది పరమాత్మగా నన్ను, ప్రకృతిగా నిన్ను నిరూపణ చేయటం కోసమే." అన్నాడు. ప్రకృతి ఎక్కడ ఉంటుందో పరమాత్మ అక్కడే ఉంటాడు. ఈ ప్రకృతి పరమాత్మల కలయికే రాధాకృష్ణులు. వారిరువురినీ విడదీయలేము.

వారి ప్రేమబంధాన్ని ప్రజలు సాధారణ మానవుల ప్రేమబంధంగా చూశారు. సూర్యుడిని, సూర్యకాంతిని విడదీయగలమా? పాలను, పాల తెలుపును వేరుచేయగలమా? పాలు తెలుపు. పాలను తోడు పెడితే పెరుగు అవుతుంది. అది తెలుపు. పెరుగు చిలికితే అది మజ్జిగ అవుతుంది. అది తెలుపు. అందులోనుంచి వచ్చే నవనీతం తెలుపు. అలాగే రాధాకృష్ణుల అనుబంధం అటువంటిది. విడదీయరానిది.

ఒకరోజు గోపికలు, గోపబాలురు బృందావనంలో ఆడారు. పాడారు. నృత్యం చేశారు. గోపికలలో రాధ నృత్యంలో రాణించింది. గోపబాలురలో కృష్ణుడు రాణించాడు. కృష్ణుడు వేణువు వాయించ సాగాడు. ఆ మధుర వేణునాదంలో విశ్వం లయించింది. గోపికలు కృష్ణుడిని వివాహమాడ దలచారు. రాధ కుడా అలాగే భావించింది. కృష్ణుడు కూడా రాధను ప్రేమించాడు.

ఒకనాడు రాధ, "నువ్వు ఇంతవరకు ఎవరితో ఉండి వచ్చావు. వారి దగ్గరకే వెళ్ళు" అంది. కృష్ణుడు, "వారందరూ నన్ను మోసగించారు. నేను ఇక్కడనుండి వెళ్ళిపోవాలనుకుంటున్నాను. కాని నీ ప్రేమ నన్ను కట్టి పడేసింది." అన్నాడు.

సమయం గడిచింది. కృష్ణుడు మధురకు వెళ్ళే తరుణం వచ్చింది. నంద యశోదలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అతడు ఇక గోకులానికి తిరిగి రాడు. కృష్ణుడు రాధ వద్దకు వచ్చి, గోపికలు నాకు అనుమతి ఇచ్చారు. నీవుకూడా అనుమతిస్తే.....అన్నాడు. కృష్ణుడు ఒక శిలా ఫలకంపై కూర్చుని ఉన్నాడు. మౌనం వారిరువురి మధ్య నాట్యం చేసింది. రాధ చిరునవ్వుతో నాకు వీడ్కోలు చెప్పాలని ఎదురు చూస్తున్నాడు. రాధ కృష్ణుని పాదాలు తాకి నమస్కరించింది. అతడి నుదుటిని ముద్దు పెట్టుకుంది. కృష్ణుడు కనుమరుగయ్యే దాకా నవ్వుతూనే ఉంది.

# శ్రీ పరమానందయ్య శిష్యులు

- రమణ ప్రసాద్

శ్రీ పరమానందయ్యగారికి తనశిష్యుల పైన ఎంతో ప్రేమ. వారి శిష్యులు తమ గురువుగారి పైన ఎంతో వినయ విధేయతలు భక్తి కలిగినవారు. గురువుగారు ఏది ఆజ్ఞాపిస్తే అది వెంటనే చెయ్యటమే కర్తవ్యంగా భావించేవారు. అయితే వారు చేసే అవక తవక పనులు అందరికీ నవ్వు తెప్పిస్తాయి. ఈ కథ చూద్దాం.....



**రామయ్య దయ్యం**

ఒకసారి శిష్యులు చేసే పనులకు గురువుగారికి కోపం వచ్చింది. "ఎక్కడికైనా పోయి చావండిరా!" అని కసురుకున్నాడు. శిష్యులు చేసేది లేక ఊరి చివరకు పోయి అక్కడ చెరువులోని నీరు త్రాగి, తరువాత ఏమి చేయాలి? అని ఆలోచిస్తున్నారు. ఇంతలో ఒక తుంటరివాడు, "ఏం పంతుళ్లూ! ఇలా వచ్చారు? రామయ్య దయ్యమై ఇక్కడ తిరుగుతున్నాడు. ఇక్కడినుండి పారిపోండి" అని భయపెట్టాడు. ఈ మాటలు విన్న శిష్యుల ముఖాలపై నెత్తురుచుక్క లేదు. వారు భయపడిపోయి అటు ఇటూ పరిగెత్తి, తిరిగి అక్కడికే వచ్చి, "ఒరేయ్! మనం ఎందుకు పరిగెడుతున్నాం రా!" అని బెంబేలు పడ్డారు. "ఆ జ్ఞాపకమొచ్చింది! రామయ్య దయ్యమయ్యాడు కదా! మనలను పట్టుకుంటాడు" అని తలోదారి పట్టి పారిపోయారు.

అలా పారిపోయి వారు పరమానందపురం చేరారు. అక్కడ బిచ్చమెత్తుకుంటూ దిక్కులేని పక్షుల్లా జీవించసాగారు. గురువుగారికి శిష్యులపైన ధ్యాస మళ్లింది. "వెర్రి కుంకలు! ఎక్కడున్నారో! ఏం చేస్తున్నారో! అని బెంగపడి వారిని వెదకటం మొదలు పెట్టాడు. కొన్ని రోజుల తరువాత శిష్యుల జాడ తెలిసింది. తనవద్దకు రమ్మని కబురు పెట్టాడు. వారు, "రామయ్య దయ్యమై తిరుగుతున్నాడు. మమ్మల్ని చంపేస్తాడు. మేము రాము" అన్నారు. గురువుగారు ఒక వ్యక్తిని పంపి వారిని సమాధాన పరచి, తనతో వారిని తీసుకురమ్మని పంపాడు. శిష్యులందరూ తిరిగి వచ్చి, "బుద్ధిగా ఉంటామండీ! మమ్మల్ని కసురుకోకండీ! మేము మీ శిష్యులమే కదా!" అని గురువుగారి వద్ద వుండి సేవ చేసుకోసాగారు.

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

అంతకు మునుపు సీతమ్మగారు గురుపూజ ఎన్నడూ చేసుకోలేదు. ఎక్కడా జరుగుతుండగా చూడనూ లేదు. తాను మామూలుగా చేసుకునే జగన్మాత పూజలో కూడ అర్ఘ్యము, పాద్యము మొదలైన షోడశోప చారములను పాటల రూపంలోనే పాడుకుంటూ చేసుకొనే వారు. అందరూ ఆమె పూజను 'పాటల పూజ' అనే వారు. "నాకు మంత్రాలు రావు బాబూ" అన్నారు సీతమ్మగారు. "పిచ్చిదానా! నువ్వు రోజూ పాడుకునే పాటలు, మంత్రాలు కావనుకుంటున్నావా? 'నా స్వామిని ఆర్తిగా పిలిచి హృదయ పీఠంపై కూర్చో బెట్టుకుంటున్నాను. పాదాలు, చేతులు ప్రక్షాళన చేసి, ఆచమానమునకు నీళ్ళు యిస్తున్నాను..' అనుకుంటూ నీ మనస్సు స్వామిపై నిలిపి చక్కగా పూజ చేసుకొని పోతుంటే ఆ పాటలే మహామంత్రాలై, జీవుడు గురయ్యే అన్ని పాట్ల నుండి నిన్ను కాపాడి, సర్వ శుభములను చేకూరుస్తాయి. జీవన్ముక్తినే ప్రసాదిస్తాయి. చక్కగా పాటల పూజ చేసుకో అమ్మా!" అన్నారు శ్రీబాబు.



సీతమ్మగారు మైమరచి తన్మయులై ఉంటే, షోడశోపచారాలూ స్వామి స్వయంగా చెప్పి ఆమెతో చేయించుకున్నారు. ఏ సంకల్పమూ చెప్పవలసిన అవసరం లేకుండానే , సర్వ సంకల్ప రాహిత్యమును పొందించగల శ్రీ సద్గురు పాదపూజను వారి చేత సద్గురు మూర్తి చేయించుకున్నారు. స్వామికి నివేదన సమర్పించి, అందరూ తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. స్వామి తామే మహా ప్రసాదమును (అన్నము, కూరలు మొదలైనవన్నీ) కలిపి, అందరికి దోసిళ్ళనిండా పెట్టి తినిపించారు. అది శ్రీగురుపరమాత్మని అనుగ్రహలీల.

ఇదంతా పూర్తి అయ్యేసరికి అర్థరాత్రి దాటింది. మళ్ళీ నాలుగు గంటలకు అందరు లేచి స్వామికి మేలుకొలుపు, సుప్రభాతము పాడి ప్రాత:కాల ప్రార్థన చేసుకున్నారు.

తాతయ్యగారి దొడ్లో ఒక పాక ఉండేది. దానిని శ్రీ బాబు

'రామాశ్రమము' అని పిలిచేవారు. ఆ స్థల భాగ్యమేమోగాని, శ్రీబాబు వారింట్లో వున్నప్పుడు ప్రతిరోజూ ఆ పాకలో కూర్చొని, భక్తులతో మాట్లాడుతూ, ఛలోక్తులాడుతూ దివ్య బోధను ప్రసాదిస్తూ ఎక్కువ సమయం గడిపే వారు. ఆ రోజు కూడ ఆ పాకలో శ్రీబాబు కూర్చుని అందరితో మాట్లాడుతున్నారు. ముందటి రోజు గురువుగారింటికని వెళ్ళిన అమ్మమ్మగారు, తదితరులు అప్పుడు తిరిగి వచ్చారు.

రాగానే శ్రీబాబును చూసి, గబ గబ నమస్కారం చేసుకోవాలని ముందుకు వచ్చారు. శ్రీ బాబు తమ పాదాలు వారికి అందనీయక, "మీరంతా పూజలూ, నమస్కారాలూ అన్నీ చేసుకునే వచ్చారు కదా? 'ఆ పుణ్యమంతా మేమే సంపాదించుకుని వచ్చా'మని అనుకుంటున్నారా? ఇక్కడ వీళ్ళు కూడ చక్కగా సద్గురు పాదపూజ చేసుకున్నారులే. ఎంత బాగా చేసుకున్నారో! చెప్పరేమర్రా?" అని, చంపకకు, శ్రీరామానికి కనుసైగ చేశారు. ఇక వాళ్ళు శ్రీబాబు పాదపూజ ఎంతో చక్కగా, వైనంగా చెప్పి చేయించుకోవటం, దోసిళ్ళతో ప్రసాదాలు పెట్టటం అన్నీ వర్ణించి ఊరించటం మొదలు పెట్టారు. ఆ వెళ్ళిన వారందరూ, "యిదంతా పోగొట్టుకున్నామే?"అని ఏడ్చి లెంపలు వేసుకున్నారు. అప్పుడు శ్రీబాబు జాలిపడి 'సరే నమస్కారం చేసుకోండి' అని పాదాలు అందించారు.

సీతమ్మగారికి శ్రీ బాబు ఎన్నో దివ్యానుభవాలను ప్రసాదించారు. ఆమె ప్రతి నిత్యము పూజించుకునే దుర్గాదేవి చిత్రపటంలో శ్రీ బాబు ఆమెకు దర్శనమిచ్చేవారు. శ్రీబాబు సన్నిధిలో ఉండేటప్పుడు ఆమెకు శ్రీబాబులో దుర్గాదేవి దర్శనం కలిగేది. ఒకసారి శ్రీబాబు దేవతార్చన చేసుకుంటున్న సమయంలో, సీతమ్మగారు గుమ్మం వద్ద కూర్చుని వున్నారు. అప్పుడు ఆమెకు భూమి నుండి ఆకాశం వరకు వ్యాపించిన దేదీప్యమానమైన తెల్లని కాంతి పుంజం కనిపించింది. అందులో శ్రీబాబు దర్శనమిచ్చారు. మరొకసారి ఆమెకు ధ్యానంలో పాల సముద్రము, అందులో వటపత్రశాయి అయిన బాల కృష్ణుని దర్శనము కలిగింది. అక్కడ బాలకృష్ణుడు, శ్రీబాబు మార్చి మార్చి దర్శనమిచ్చారు. అంతలోనే ఆ దృశ్యం మాయమై, ప్రపంచము, పట్టణాలు, మేడలు, బజార్లు రంగుల రాట్నాలు, కొట్లు, యిళ్ళు, తీర్థాలు, సముద్రాలు, పర్వతాలు కనిపించాయి. బాలకృష్ణుని సంకల్పంతోనే ప్రపంచమంతా పుట్టిందని, శ్రీబాబే బాలకృష్ణుడని ఆమెకు దివ్యస్ఫురణ కలిగింది. ఇలా ఎన్నో దివ్య దర్శనాలను శ్రీబాబు అనుగ్రహంతో ఆమె పొందగలిగారు.

- సశేషం

## విష్ణు  కథలు

-గత సంచిక తరువాయి

# మీరాబాయి

- రమణ ప్రసాద్

మీరాకు అంతఃపురవాసం దుర్భరమైంది. ఆమె ప్రతిరోజూ తన భవన ప్రాంగణంలో తన భర్త కట్టించిన కృష్ణమందిరానికి వెళ్ళి సంకీర్తన చేస్తూ ఉండేది. అక్కడకు అనేక మంది భక్తులు, సాధువులు వచ్చి సంకీర్తనలో పాల్గొని మైమరచిపోయేవారు. ఇది మీరా మరిది అయిన విక్రమజిత్ రాణాకు గిట్టేదికాదు. ఎన్నో ఆంక్షలు పెట్టాడు. కాని ఫలితం శూన్యం.



మొగల్ సామ్రాజ్య చక్రవర్తి అక్బర్ వద్ద తాన్‌సేన్ అనే ఆస్థాన సంగీత విద్వాంసుడు మీరా గురించి ఆమె చేసే కీర్తనల గురించి విని అక్బర్ పాదుషాకి చెప్పాడు. ఆమెను దర్శించి 'అల్లా' కృపను పొందాలని అనుకున్నారు.

ఈ సంఘటన గురించి శ్రీబాబూజీ మహారాజ్‌వారు తమ అనుగ్రహ భాషణములలో ఎన్నో సార్లు చెప్పేవారు. శ్రీబాబు, "భగవానుడు ఎప్పుడు ఎవరిని ఎలా అనుగ్రహిస్తాడో ఎవరు చెప్పగలరు? అది వారి వారి పూర్వజన్మసంస్కారాన్ని బట్టి ఉంటుంది. మీరాదేవి శ్రీకృష్ణ పరమాత్ముడిని ఆరాధిస్తూ గానం చేస్తూ నృత్యం చేస్తూ, భక్తి పారవశ్యంతో తన్మయత్వం పొందే మహాత్మురాలు.

అక్బర్ చక్రవర్తి రసికప్రియుడు. ఆయన జన్మ సంస్కారం పండింది. కాబట్టి మీరాదేవి గురించి తాన్‌సేన్ చెప్పింది విన్న తరువాత ఆ మహాత్మురాలు శత్రురాజ్యంలో ఉన్నప్పటికీ, ఎలాగైనా ఆమెను దర్శించి అల్లా కృపను పొందాలని అనుకొన్నాడు. అటువంటి భావం కలగటానికి కారణం ఏమిటి? అక్బర్ చక్రవర్తిలో ఏ శక్తి ఆ భావాన్ని కలగచేసింది?

జన్మ జన్మలనుంచి రాశీభూతమైన సంస్కారమే!

మనం చేసిన సాధన వృథా పోదు. ఆదే మన వెంట వచ్చేది. అక్బర్ చక్రవర్తికి మీరాను దర్శించాలనే తపన పెరిగింది. అయితే మీరాదేవి శత్రు రాజ్యంలో ఉంది. ఆమెను దర్శించటం ఎలా సాధ్య పడుతుంది? అక్బర్ చక్రవర్తిలోని తపనే ఆయనకు ఒక ఆలోచన స్ఫురింపజేసింది.

అక్బర్ చక్రవర్తి, తాన్‌సేన్‌లు సన్యాసుల వేషం వేసుకుని ఆ మహాత్మురాలిని దర్శించటానికి నిర్ణయించుకున్నారు. అక్బర్ తన చక్రవర్తి పదవిని, హోదాని మరచి సన్యసించటం అంటే అది సామాన్య విషయమా? అది అక్బర్ చక్రవర్తి పూర్వజన్మ పుణ్యఫలం.

అక్బర్ చక్రవర్తి తాన్‌సేన్‌లు మీరాదేవిని దర్శించటానికి వెళ్ళేసరికి మీరాబాయి శ్రీకృష్ణభగవానుని కీర్తిస్తూ భక్తి పారవశ్యంలో ఉంది. ఆమె మనస్సు శ్రీకృష్ణపరమాత్మలో లీనమైంది. ఆ తన్మయత్వంలో ఉద్భవించే గానామృత మధురిమని ఎవరు వర్ణించగలరు?

ఆ గానామృతాన్ని విన్న అక్బర్, తాన్‌సేన్‌లు పరవశించిపోయారు. అక్బర్ చక్రవర్తి హృదయంలో ఆమె పాదపద్మాలు నిల్చిపోయాయి. అజ్ఞానం తొలగిపోయి ఆనందంలో ఓలలాడుతూ పారవశ్యంలో మునిగి పోయాడు.

అక్బర్ చక్రవర్తి వెంటనే మీరాబాయి చరణారవిందములకు నమస్కరించి అత్యంత విలువైన వజ్రములతో కూడిన హారాన్ని మీరా ఆరాధించే శ్రీకృష్ణ పరమాత్మునికి సమర్పించాడు.

తన్మయత్వంలో అక్కడ ఉన్నవారంతా అక్బర్ శ్రీకృష్ణ పరమాత్మునికి సమర్పించిన హారం గురించిగాని, సమర్పించిన వ్యక్తిని గురించిగాని ఆలోచించే స్థితిలోలేరు. వారి హృదయాలలో మీరాబాయి వర్ణించిన కృష్ణుని పాదపద్మాలే నిలిచిపోయాయి.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL